ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 9, 2014



కోల్పోతున్న బాల్యం



అప్పుడు - ఇప్పుడు

గుర్తు పట్టారా!

బుజ్జి బుజ్జి మాటలతో, అమాయకపు నటనతో... అలా ఆకట్టుకుంటారు బాల నటులు. సరిగ్గా నాలుగేళ్ల వయసు కూడా లేని చిన్నారులు అలా నటించేసి మెప్పించేస్తుంటారు. అయితే ఆ తర్వాత ప్రధాన పాత్రధారులుగా తెర మొత్తం ఆక్రమించేస్తుంటారు. నెంబర్ వన్‌గానూ వెలిగిపోతుంటారు. 'నేటి బాల నటులే రేపటి కథానాయికలు, నాయకులు' అన్న మాట అలా వచ్చిందేనేమో!

అలాంటి బాల నటులకు కొదవే లేదు మనకు. వారిలో కొందరిని మీ ముందుంచాం. కాకపోతే సరిగ్గా జత చేయాల్సిన భారం మాత్రం మీదే. జాగ్రత్తగా చూసి...ఒకటికి రెండు సార్లు ఆలోచించి ఆ పని చేయండి మరి.

మీ ముందుకొచ్చిన వారిలో కమల్‌హాసన్, శ్రీదేవి, సంజయ్‌దత్, ఆఫ్తాబ్ శివదాసాని, శ్వేత బసు ప్రసాద్, అమీర్‌ఖాన్, సారిక, ఆయేషా టకియా, బాబీ డియోల్, నీతూ సింగ్, హన్సిక, రిషి కపూర్, ఊర్మిళ మతోంద్కర్, హృతిక్ రోషన్, శశికపూర్ వున్నారు.

గుర్తించారా మరి.

✡

ప్రజాశక్తి

snehaweekly.praja@gmail.com

కల ... పగటి కల

కలలు కనని వారెవరుంటారు?! అందునా ఖర్చు లేని పని కదా. తీరిక దొరికితే చాలు! అలా కలల లోకంలో విహరించేస్తుంటారు. నిజానికి కల! మనసులో పేరుకు పోయిన దురాశలను, నిరాశలను అందీ అందని ఆశలుగా మార్చివేసే మందు. మితంగా వేస్తే కండకూ గుండెకూ పుష్టినిచ్చే దివ్యౌషధం. ఇందులో అందం వుంది. ఆనందం వుంది. ఉత్తేజం వుంది. పట్టుదల వుంటే కలను సాకారం చేసుకోనూ వచ్చు.

మరి పగటి కలల సంగతో! వీటిని కనడానికి రాత్రి ఎప్పుడవుతుందా అని ఎదురు చూడనవసరంలే! నిజానికి చాలా మంది రాత్రి కలలకు ముందుగానే వీటిని ఏర్పాటు చేసుకుంటుంటారు. చిటికెలో పగటి కల కనేస్తుంటారు. కానీ కొందరికి.... పగటి కలలు కనడానికి కాని, వాటిని గురించి వినడానికి కాని తీరికా ఓపికా వుండవట. బుకాయిస్తుంటారు.

◆ మనలో మాట

కలకీ పగటి కలకీ తేడా ఒకటి వుంది. అది అప్రయత్నంగా కనేది. అరక్షణంలో యుగం సేపనిపించేంత పెద్ద కల కనొచ్చు. ప్రయత్న పూర్వకంగా కనేది పగటికల. ఎంతసేపు కల వుంటే అంతసేపూ మేధోమధనం జరుగుతూనే వుండాలి. కావాల్సిందల్లా కోరిక. తీరిక. అంతే.

కోరిక వుంటే తీరిక లేకపోయినా కంటుంటారు కొందరు. కోరిక కలకు కీలకమైనది. రోడ్డుమీద నడుస్తున్నా, బస్సులో జనం మధ్య నించున్నా, ఆఫీసులో చివాట్లు తింటున్నా, కూడా పగటి కల యమ అర్జంటుగా కనేయొచ్చు. ఇందులో పేద, ధనిక, బలవంతుడు, బలహీనుడు, మేధావి, మేదకుడు, సమర్థుడు, అసమర్థుడు అన్న బేధం లేకుండా అందరీక ఉచిత ప్రవేశం లభించే స్వర్గసీమ పగటికల.

ప్రతిక్షణం ప్రపంచమంతా కోట్లకొద్దీ పగటికలలు ఉత్పత్తి అవుతూనే వుంటాయి. వాటిలో బద్దకిస్టులు విపరీతంగా పని చెమటోడుస్తుంటారు. ఆఫీసులో సాధారణ ఉద్యోగులు తమను ఇబ్బంది పెట్టే పై అధికారులను ... అప్పటి వరకు అడగాలని అనుకున్న వాటన్నిటినీ .... అడిగేసి, దులిపేసి... కడిగేస్తుంటారు. రచయితలు మహాప్రస్థానాలు, ప్రపంచాన్నే కుదిపివేసిన ఆ పది రోజులు, ఏడు తరాలు, యుద్ధము - శాంతి... వంటి రచనలు రెండు చేతులతో చేస్తుంటారు. నటులు ఎన్టీఆర్, ఎఎన్నార్, సావిత్రి, జమునలా నటించేస్తుంటారు. సోంబేరులు ఏమాత్రం కష్టపడకుండా సాయంత్రానికల్లా ... కోట్లకు పడగలెత్తి ... ఆకాశహర్మ్యాలు నిర్మించేస్తుంటారు.

ప్రతి పగటి కలకూ ఒక చివర వుంటుంది. దాన్నే ముగింపు అంటారు. అది నిష్టూరమైనా... నిజం ఏంటో చెప్పి మేల్కొల్పుతుంది. కళ్లు నులుముకుని చూస్తే... అది కల. ఇది ఇల అని తెలుస్తుంది. కాని... కష్ట పడాల్సిన పని లేదు కదాని! ఊరకే పగటి కలలు కనేస్తే...నిజమైపోతుందా! 'బాపడు-పేల పిండి' కథ తెల్సు కదా.



టపా

విలాస వస్తువు!

ఈ వారం కవర్‌స్టోరీ 'రీల్ రియాల్టీ' సినిమాల్లోని అమ్మాయిల పాత్రలను కళ్లకు కట్టినట్టు చూపించింది. హీరోయిన్లను కేవలం విలాసవస్తువుగా చూపిస్తున్నారు. స్త్రీలను అశ్లీలంగా చూపించడానికే తెగ ఆరాటపడుతున్నారే తప్ప దానివల్ల యువత ఎలాంటి ప్రభావాలకు లోనవుతుందో గుర్తించలేకపోతున్నారు. ఒకవేళ తెలిసినాగానీ దాన్ని ఓ పెద్ద సమస్యగా పట్టించుకోవడం లేదు. సినిమాలను సామాజిక కోణంలో కాకుండా కేవలం వాణిజ్య మార్గంలోనే తీయడానికే మొగ్గు చూపుతున్నారు. దర్శక నిర్మాతలు సమాజానికి ఉపయోగపడేలా మంచి సినిమాలు తీస్తే బాగుంటుంది. మహిళలను కించపరిచే విధంగా సినిమాలు ఉండకూడదు.

ఆర్. పట్టాభి, గుంటూరు.

డబ్బు మైకం

కథ 'రక్త స్పర్శ' ఆకట్టుకుంది. ప్రతి బంధం వెనుక ఆర్థిక సంబంధాలు దాగి ఉంటాయని రుజువు చేసింది. ప్రపంచాన్నే శాసిస్తున్నది డబ్బు. ఆ డబ్బు మైకంలో తల్లిదండ్రులు, అక్కా చెల్లెళ్లు, అన్నదమ్ములు ఇలాంటి బంధాలేవీ కనబడకుండా డబ్బునే పొర కప్పేస్తున్నది. మానవీయ విలువల్ని నిలువునా పాతరేస్తున్నది. కానీ డబ్బే ప్రధానంగా చూసేవాళ్లకి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఆ బంధం విలువ తెలిసొస్తుంది. కానీ ఆ విలువ తెలిసేనాటికి ఆ మనుషులుంటారా అంటే ప్రశ్నార్థకమే.

ఎస్. శ్యామ్, కాకినాడ.

పంచ్ పవర్

మహ్మద్ అలీ గురించి తెలియని వారికి కూడా తెలుసుకునే అవకాశం కలిగింది. ఎందుకంటే పేరు విన్నాగానీ ఆయన గురించి పూర్తిగా తెలియదు. ఆ వ్యాసం చదువుతుంటే అప్పటికాలంలో జాతి వివక్ష ఎంతగా ఉండేదో అర్థమైంది. అలాగే వివక్షకు గురవుతున్నామని బాధపడడం కంటే కూడా ఆ వివక్షకు వ్యతిరేకంగా పోరాడటంలోనే నిజమైన గెలుపును సాధించాడు మహ్మద్ అలీ. బాక్సింగ్‌లో చరిత్ర సృష్టించిన అలీ జీవిత చరమాంకంలో పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతుండడం బాధ కలిగిస్తుంది.

ఎ. దివ్య, మాచర్ల.

ఆటవిక శిక్షలకు పెట్టింది పేరు

అండమాన్ జైలు గురించే భయంగా, వింతగా ప్రజలు చెప్పుకొనేవారు. ఆ జైలుకు వెళితే ప్రాణాలతో తిరిగి రారని కూడా చెప్పుకునేవారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో కడలూరు, వేలూరు జైల్లో చాలామంది కమ్యూనిస్టులు చనిపోయారు. ఆటవిక శిక్షలు అమలు జరిగాయి. అండమాన్ జైలు అదే పరిస్థితి భాగ్య నగరంలోని సెల్యులార్ జైలు అదే కోవకు చెందినది. కఠిన శిక్షలు అమలు చేయడంలో బ్రిటిష్‌వాళ్లకు మించిన వారు లేరు. ఉరిశిక్షలు ఎక్కువగా అమలు చేసేవారు. సెల్యూలర్ జైలు గురించి చాలా విషయాలు తెలియజేశారు.

- టి. శ్రీరామమూర్తి,
గాజువాక విశాఖ.

ఈ సంచికలో....

కోల్పోతున్న బాల్యం

కవర్‌స్టోరీ —— 14

బాల్యం ఒక అద్భుత ప్రపంచం. అపురూప అనుభవాల నిలయం. అది ఆటపాటల ఉద్యానవనం. ఏ చీకూచింతా లేని ఆహ్లాద ప్రయాణం. కథాకమనీయాల కలబోత .. ఆనందానుభూతుల తలపోత! మరి బాల్యం ఇప్పుడు ఇలా ఉందా? అంటే- ఉంది అని చెప్పలేం. బాల్యమూ, కెరీరిజం కలగలిసి సాగుతున్నందువల్ల - బాల్యం బాల్య మాధుర్యాన్ని కోల్పోతోంది. భవిష్యత్తు వైపు పరుగు పేరుతో బంగారు బాల్యాన్ని మిస్సవుతోంది.

చూద్దామా 4
బొమ్మరిల్లు
కథ 6
బతుకు బండి
సీరియల్ 8
ప్రేమ- విప్లవం
నవ్వుల్- పువ్వుల్ 11
రుచి 18
ఊరించే ఉప్మా
కొత్త పుస్తకాలు 19
సంప్రదాయ చదువుల సరిహద్దులు దాటేద్దాం!
సమ్‌థింగ్ స్పెషల్ 21
సంక్షోభంలో సంపదల పెరుగుదల
బాలనేస్తాలు 22
కుక్క - నక్క (కథ)
మనసు 24
ప్రేమ గూళ్లు

ప్రత్యేకం —— 12
ఆపద సమయాల్లో
ఆదుకునే 'యాప్'



సొరంగం తవ్వుతూనే వున్నాడు

ఒకే పనిని దశాబ్దాల తరబడి విసుగూ విరామం లేకుండా చెయ్యగలరా! అంటే అందుకు విలియమ్ హెన్రీని చెప్పుకోవచ్చు. అమెరికాలోని ఎల్ పాసో అనే చోటికెళ్తే ఈ హెన్రీ కనిపిస్తాడు. మనం పిల్చినా, మాట కలపబోయినా పెద్దగా స్పందించడు. చాలా అడిగితే గొట్టు గొట్టు సమాధానాలిస్తాడు. వాటిని బట్టే 'నా పనిని పాడు చెయ్యకండి' అని చెప్తున్నట్టుంటుంది. గత 32 సంవత్సరాలుగా అక్కడి ఒక పర్వతాన్ని తవ్వుతూ వున్నాడు. ఇప్పటికి 2,087 అడుగుల పొడవు సొరంగ మార్గాన్ని తవ్వాడు. ఇంత పట్టుదలతో ఈ పని చేస్తున్నాడూ అంటే ఎవరికైనా ఓ అనుమానం వస్తుంది. ఈయనగాని అక్కడ ఏదైనా నిధి నిక్షేపాలు దాచి పెట్టాడా ఏంటి? అని. కానీ అలాంటిదేమీ లేదని తేలిందట. పైగా అతని వాలకం కూడా అలా వుండదు. పరమ పిసినారిలా కనిపిస్తాడు. తాగి పడేసిన బాటిళ్లతో చెప్పులు తయారుచేసుకుని వేసుకున్నాడు. తీసేసిన గోతాలతో బట్టలు చేసుకుని తొడుక్కున్నాడు. ఇవన్నీ పక్కన పెడితే ఇప్పుడా సొరంగ మార్గం పెద్ద సందర్శనీయ ప్రదేశమైంది. దేశవిదేశాల నుంచి ఎందరో వచ్చి చూసి వెళ్తున్నారు.

ఒక్కరోజులో 19 దేశాల పర్యటన

నమ్మబుద్ధి కావడం లేదు కదూ. కానీ చేశారండీ! నార్వేకి చెందిన గున్నర్ గార్ఫోర్స్, టే యంగ్ పాక్, ఒబెస్టైన్ జువిక్ అనే ముగ్గురూ మంచి మిత్రులు. వీరికి ప్రయాణాలంటే మహా ఇష్టం. అదీ ఒక దేశంలో కాదు. పలు దేశాల్లో పర్యటించాలని కోరిక. అందుకు వారు తీసుకున్న సమయం ఎంతో తెలుసా! ఇరవై నాలుగు గంటలు. ఒక్క రోజులో పంతొమ్మిది దేశాల్లో కాలూని రావాలని అనుకున్నారు. అనుకోవడమే కాదు. చేసి చూపించారు కూడా. సెప్టెంబర్ 22వ తేదీ అర్ధరాత్రి గ్రీస్ నుంచి బయల్దేరారు. వాయవ్య మార్గంలో బల్గేరియా, మెక్డోనియా, కొసావో, సెర్బియా, క్రోషియ, బోస్నియా, సాల్వోనియ, ఆస్ట్రియా, హంగేరి, స్లోవోకియ, చెక్ రిపబ్లిక్, జర్మనీ, నెదర్లాండ్స్, బెల్జియం, లక్సెంబర్గ్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ దేశాలను పర్యటించారు. అధికశాతం ప్రయాణాన్ని అద్దె కారుల్లోనే చేసేశారు. మెక్డోనియా నుంచి సెర్బియాకు, ఆస్ట్రియా నుంచి జర్మనీకి వెళ్లడానికి మాత్రం విమానాలను కిరాయికి తీసుకున్నారు. ఇదంతా బానే వుంది కానీ... అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? అన్న అనుమానం రాకమానదు. వీరికి ఓ ప్రయివేటు కంపెనీ ఆర్థిక సాయం చేసిందిలెండి. కొత్త దేశాల్లో దిగి... తిండి తినడానికి కూడా సమయం వుండేది కాదట. దాంతో అప్‌లోడ్, డౌన్‌లోడ్ అన్నీ కారుల్లోనే చేసేసేవాళ్లు. గతంలో ఒక్కరోజులో పదిహేడు దేశాలను పర్యటించిన రికార్డును .... ఈ ముగ్గురు బద్దలు కొట్టారు.

ఆకలి..దప్పిక..వుండదు

ఇప్పుడు తిన్నా మరి కాసేపట్లోనే ఆకలేస్తుంది ఆరోగ్యవంతులకు. కానీ లండన్ జోన్స్ అనే ఈ చిన్నారికి ఏడాదిగా ఆకలి, దప్పిక ఏవీ లేవట. ఎప్పుడూ కడుపు నిండుగా వున్నట్టుంటుంది. దాంతో వాడి అమ్మానాన్నా ఎంత కంగారు పడుతున్నారనీ. ఎంతో బతిమిలాడి బామాలి... ఏది పెట్టబోయినా, తాగించబోయినా...అతి కష్టం మీద ఒక్కసారి మాత్రమే నోట్లో వేసుకుంటాడు. తర్వాత మొహం చిట్లిస్తాడు. ఏడాది నుంచి ఈ సమస్య వుండడం వల్ల జోన్స్ బాగా బరువు తగ్గిపోయాడు. బలహీనంగా, నీరసంగా రెండు అడుగులు వెయ్యలేడు. పరుగెట్టలేడు. ఏదీ చేయలేడు. సోఫాలో అలా కూర్చుని తన తమ్ముడు ఆటలు, పరుగులు చూస్తుంటాడు. తల్లిదండ్రులు ఎన్నో ఆస్పత్రుల చుట్టూ తిప్పారు జోన్స్‌ను. ఎంతో డబ్బు ఖర్చు చేసి వైద్యం చేయించారు. కానీ ఫలితం కనిపించలేదు. కారణం చెప్పలేకపోతున్నారు. అయినా ఆశ చావక మరో కొత్త డాక్టర్‌ని వెతుకుతూనే వున్నారు అమ్మానాన్నా.

బొమ్మరిల్లు

ఆయనో గొప్ప కార్టూనిస్టు. తన బొమ్మలతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నాడు. అంత పెద్ద మనిషి సైతం బొమ్మలను చూసి మనసు పారేసుకునేవాడంటే నమ్మబుద్ధి కాదు. చిన్నపిల్లాడిలా సంబరపడిపోయేవాడంటే విశ్వసించబుద్ధి కాదు! ఆయనలోని పసిమనసుని ప్రపంచానికి పరిచయం చేసేదే ఢిల్లీలో కొలువుదీరిన 'ఇంటర్నేషనల్ డాల్స్ మ్యూజియమ్'. ఆ పెద్దాయనే శంకర్. బొమ్మరిల్లు కోసం ఆయన ఎంతగా తపించిపోయారో చూద్దాం.

శంకర్ సేకరించిన తొలి బొమ్మ

'ప్రపంచంలో ఎన్ని జాతుల వారున్నారు? వారి ఆచార వ్యవహారాలేంటి? సంస్కృతీ సంప్రదాయాలేంటి?' అన్న ప్రశ్నలు అందరిలో కాకపోయినా కొందరిలోనైనా మెదులుతూనే వుంటాయి. ప్రపంచమంతా చుట్టి ఆ వివరాలు తెలుసుకోవాలని కూడా ఉవ్విళ్లూరుతుంటారు. అందుకు పరిస్థితులు సహకరిస్తే ఓకే. లేకపోతేనే సమస్య! ఆ లోటు భర్తీ చేయడానికి ఢిల్లీలో కొలువుదీరిన శంకర్ 'బొమ్మరిల్లు' ఉపయోగపడుతుంది.

రంగురంగుల బొమ్మలు. రకరకాల బొమ్మలు. దేశదేశాల బొమ్మలు. అందమైన బొమ్మలు. శంకర్ మ్యూజియమ్ సొంతం. ఇవి పిల్లలనేగాక పెద్దలను సైతం ఇట్టే ఆకట్టుకుంటాయి. సందర్శకులు లోపలికి అడుగెడితే చాలు! కళ్లు ఆర్పడం మర్చిపోయి బొమ్మల్లా మారిపోతారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు, సంస్కృతులకు చెందిన అనేక రకాల బొమ్మలు కనువిందు చేస్తాయి. వాటికి కట్టిన వస్త్రాలు, పెట్టిన ఆభరణాలు, వేసిన రంగులు, తల వెంట్రుకలు, చెప్పులు, బూట్లు... వాటికి జీవం పోస్తాయనే అనుకోవాలి. మ్యూజియంలో మొత్తం 85 దేశాలకు చెందిన 6,500 బొమ్మలున్నాయి. యూరపుదేశాలు, ఆసియా దేశాలు, మధ్య ప్రాచ్య దేశాలవి కన్పిస్తాయి. వాటిలో ఎన్ని రకాల వారున్నారనీ! స్వాతంత్ర్య సమరయోధులు, రాజులు, రాణులు, నృత్యకారిణులు, రైతులు, గృహిణులు, వాద్యకారులు, దేవతలు, మంత్రగత్తెలు.... అందరూ కనువిందు చేస్తారు. రంగురంగుల గళ్లచీర కట్టుకుని మంగళసూత్రం ధరించిన గృహిణి, పంచె కట్టుకుని నుదుటిన విభూతి రేఖలు దిద్దుకున్న బ్రాహ్మణుడు, మజ్జిగ చిలుకుతున్న ముదిత, చేపలమ్మే చిన్నది, గాజులమ్మే అబ్బి...బొమ్మల మధ్యలో ఎక్కడో వున్నా ఆకట్టుకుంటూనే వుంటారు. ఇప్పుడు ప్రపంచ పటంలో కన్పించకుండా పోయిన వివిధ దేశాల ప్రథమ మహిళలు బహూకరించిన బొమ్మలు కూడా ఇక్కడ దర్శనమిస్తాయి. మ్యూజియమ్‌లో బొమ్మలు తయారుచేసే వర్క్‌షాప్ కూడా వుంది. నరనరాలన నైపుణ్యం నింపుకున్న పనివారు తదేక దీక్షతో బొమ్మలు తయారుచేస్తుండటం మనకు అగుపిస్తుంది.

మ్యూజియంలో బొమ్మలను రెండు భాగాలుగా అమర్చారు. ఒక వైపున పాశ్చాత్య దేశాల బొమ్మలుంటే...రెండో వైపున భారత్, పాకిస్తాన్, చైనా, జపాన్, ఆఫ్రికా ... దేశాల బొమ్మలుంటాయి. ఇవేనా! మ్యూజియంకు చెందిన వర్క్‌షాప్‌లో తయారైన దేశీయ బొమ్మలు కూడా చూపరులను ఆకట్టుకుంటాయి. భరతనాట్యం, కథక్, కథాకళి వంటి దేశీయ నృత్యకళాకారులను ప్రతిబింబించే బొమ్మలు మనవారికి ఎంతగానో నచ్చుతాయి. ఇలా వర్క్‌షాపులో తయారైన బొమ్మలను విదేశాలకు పంపడం ద్వారా వారి బొమ్మలను నిర్వాహకులు సేకరిస్తున్నారు.



బొమ్మల సేకరణ ఎప్పుడు...ఎలా!

కేరళలో (1920) జన్మించిన బుజ్జి శంకర్‌కు బొమ్మలంటే మహాఇష్టం. సొంతంగా బొమ్మలు వేయడమంటే మరింత ఇష్టం. ఓసారి క్లాసులో కూర్చుని కునుకు తీస్తున్న మాష్టారి బొమ్మను కాగితం మీద దించేశాడు. ఆనక హెడ్మాస్టారితో తిట్లు కూడా తిన్నాడనుకోండి! వారికి చిన్నారి శంకర్‌లో ఉలిపిరి కన్పిస్తే... ఆ బొమ్మను చూసిన వారి బంధువొకాయనకు మాత్రం భవిష్యత్ ఆర్టిస్టు కనిపించాడు. అప్పటి నుంచి బొమ్మలు వేయమని ప్రోత్సహించసాగాడు. డిగ్రీ వరకు త్రివేండ్రంలో చదువుకున్న శంకర్ 1927లో ముంబై చేరుకున్నాడు. అక్కడే హాబీగా వేసిన కార్టూన్లు స్థానికంగా పత్రికల్లో అచ్చయ్యేవి. అంతేకాదు! హిందూస్తాన్ టైమ్స్ పత్రికలో కార్టూనిస్టు అవకాశం కొట్టేశారు. అప్పట్లో లార్డ్ విల్లింగ్టన్, లిన్‌లిత్‌గో వంటి వైస్రాయిల అభిమానాన్ని కూడా పొందారు. 1948లో శంకర్స్ వీక్లీ అనే పత్రికను ప్రారంభించారు. పిల్లంటే ఇష్టపడే వ్యక్తి కావడంతో ప్రతి సంవత్సరం వారికోసం పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించేవారు. అలా ఓ సారి విజేతలకు అందించమని హంగరీ రాయబారి ఒకాయన ఇచ్చిన ఆ దేశపు బొమ్మ శంకర్‌కు తెగ నచ్చేసింది. దాన్ని తనే వుంచేసుకుంటానని కూడా అడిగేశారు ఆగలేక. అంత పెద్ద కార్యూనిస్టు చిరు కోరికను రాయబారి కాదనలేకపోయారు. అదండీ సంగతి. శంకర్‌లో బొమ్మలు సేకరించాలన్న ఆలోచన అలా మొదలైంది. ఆ సేకరణ నిరంతర స్రవంతిలా సాగించారు. ఇప్పుడు కూడా మ్యూజియమ్ వారు ఆ పని చేస్తూనే వున్నారు.

మ్యూజియం తయారైందిలా ...

పిల్లలంటే శంకర్‌కు ప్రత్యేక అభిమానం. వారికోసం పుస్తకాలు ప్రచురించాలన్న కోరికతో చిల్డ్రన్స్ బుక్ ట్రస్ట్‌ను ప్రారంభించారు. ఓ వైపు దాన్ని నడుపుతూనే బొమ్మలు సేకరించేవారు. ప్రధాని నెహ్రూతో పాటుగా విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడల్లా అక్కడి బొమ్మలను సేకరించేవారు. వాటితో బీద పిల్లలకోసం ఎగ్జిబిషన్లు నడుపుతుండేవారు. తను సేకరించిన బొమ్మలన్నిటినీ ఒక చోటి నుంచి మరో చోటికి తరలించే క్రమంలో కొన్ని పాడైపోయేవి. దానికి ఆయన మనసు విలవిల్లాడిపోయేది. ఓసారి ఎగ్జిబిషన్ సందర్శించడానికి ప్రధాని నెహ్రూ కుమార్తె ఇందిరతో కలిసి వచ్చారు. అప్పుడు శంకర్ ఆ విషయాన్నే ప్రస్తావించారు. వెంటనే ఇందిరాగాంధీ 'బొమ్మలను అటూ ఇటూ తిప్పకుండా ఓ ఎగ్జిబిషన్ పెడితే ఎలా వుంటుంది?' అన్నారట. అంతే అప్పుడు నిర్మాణంలో సవున్న చిల్డ్రన్స్ బుక్ ట్రస్ట్'లో కొంత భాగాన్ని దీనికోసం కేటాయించారు. 1965లో అప్పటి రాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ చేతులమీదగా 'శంకర్స్ ఇంటర్నేషనల్ డాల్స్ మ్యూజియం' ప్రారంభమైంది. మ్యూజియమ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుంది. మధ్యలో భోజన విరామం వంటివేం వుండవు. పెద్దలకు 15, పిల్లలకు 5 రూపాయలు టిక్కెట్లు. జాతీయ, పండుగ దినాలుగాక ప్రతి సోమవారం సెలవు.

ఇన్ని ప్రత్యేకతలున్న శంకర్ బొమ్మరిల్లును సందర్శించాలని ఎవరికి మాత్రం అనిపించదు చెప్పండి!

శంకర్ గురించి....



పూర్తి పేరు:
కేశవ శంకర పిళ్లై
(శంకర్‌గా సుపరిచితులు)
మన మధ్య గడిపిన కాలం:
జులై 31, 1902 - డిసెంబర్ 26, 1989
వృత్తి: కార్టూనిస్టు, రచయిత
అవార్డులు: పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్
ప్రసిద్ధిగాంచినవి: శంకర్స్ వీక్లీ, చిల్డ్రన్స్ బుక్ ట్రస్ట్

బతుకు బండి

సంగారపు వెంకట కోటేశ్వరరావు

◆ కథ

ఉదయం ఆరుగంటల సమయంలో బోసు బొమ్మ సెంటరువైపు వెళ్లే వాళ్లకు తమిళ భక్తి గీతాలు వినబడుతుంటాయి. ఆ పాటలు బాబాయి టిఫిన్ సెంటరు లోనివని ఆ పరిసరాలతో పరిచయం వున్న వాళ్లందరికీ తెలుసు. ఆ టిఫిన్ సెంటరు నడిపే బాబాయి పేరు నటేశన్ అని, అతను తమిళ దేశస్థుడని కొందరికే తెలుసు. ఆ కొందరిలో నేనూ ఒకడ్ని. నగరంలో ఏ కారణం చేతనో మూతబడ్డ సినిమా థియేటర్ పక్కన, జమ్మి చెట్టు నీడన, బోసుబొమ్మకు దగ్గరగా ఉంటుంది నటేశన్ టిఫిన్ బండి. నిజానికి నటేశన్‌కు నలభై ఏళ్లుంటాయి. జీవితంలోని ఆటుపోట్లకు నలిగిపోయి యాభై ఏళ్లవాడిలా కనబడతాడు. సన్నగా, పొడవుగా, చామనచాయ, లోతుకు పోయిన కళ్లు, పీక్కుపోయిన చెంపలు, అడ్డకట్టు, అరచేతుల చొక్కా, నొసటన విభూతి, మధ్యలో ఎర్రని కుంకుమ బొట్టు, ఇదీ నటేశన్ రూపం.

నటేశన్‌ది తమిళ దేశంలోని ఓ మారుమూల కుగ్రామం. నటేశన్ తండ్రి జరుగుబాటు లేక, పొట్ట చేత బట్టుకొని, నటేశన్ పదేళ్ల పిల్లాడప్పుడు, అన్నపూర్ణ అయిన ఆంధ్రదేశంలో అడుగుపెట్టాడు. నగరంలోని అనేక హోటల్స్‌లో పనిచేశాడు. నటేశన్ తెలివైన పిల్లవాడని, బాగా చదివించి పెద్ద ఉద్యోగస్తుడ్ని చేయాలని తండ్రి కలలు కన్నాడు. తానొకటి తలిస్తే దైవమొకటి తలిచినట్టు, నటేశన్ స్కూలు ఫైనల్‌లో వుండగానే తండ్రి కాలం చేశాడు.

అప్పటి నుండి కుటుంబ బాధ్యత నటేశన్ నెత్తిన పడింది. చదువుకు స్వస్తి చెప్పి, కుటుంబం కోసం తండ్రి పని చేసిన హోటల్‌లోనే పనిచేశాడు. పెళ్లయి ఇద్దరు పిల్లలు పుట్టినాక, సంపాదన చాలక టిఫిన్ బండి పెట్టుకున్నాడు. అదే అతని బతుకుబండి అయింది. ఆ టిఫిన్ బండి మీద వచ్చే సంపాదనతో సంసారాన్ని నెట్టుకు రావటమే కాక, మరో ఇద్దరికి జీవనం కల్పించాడు నటేశన్.

ఉదయాన్నే ఆరుగంటలకల్లా టిఫిన్ సెంటరు దగ్గర ఊడ్చి, నీళ్లు చల్లి, ముగ్గు పెడుతుంది రాజాలు. ఒక పొడవాటి చెక్క బల్ల, నాలుగు కుర్చీలు టిఫిన్ బండి ముందు వేస్తుంది. రాజాలుకు అరవై ఏళ్లుంటాయి. వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన కొడుకూ, కోడలూ ఇంటి నుండి తన్ని తరిమేస్తే రాజాలు రోడ్డున పడ్డది. బస్టాండులోనూ, రైల్వేస్టేషన్ దగ్గరా, గుడిమెట్ల మీద పైసలడుక్కుంటూ జీవనం సాగిస్తున్న రాజాలు, చివరికి నటేశన్ టిఫిన్ సెంటరును చేరింది.

రాజాలు ప్లేట్లు, గ్లాసులు కడుగుతుంది. ఉల్లిపాయలూ, పచ్చిమిర్చి తరిగిస్తుంది. దగ్గరలో ఉన్న కార్పొరేషన్ కుళాయి నుండి బాల్చీలలో నీళ్లు తెస్తుంది. టిఫిన్ బండిని నమ్ముకొని రోజులు వెళ్లమారుస్తోంది.

నటేశన్ ఉదయాన్నే స్నానం చేసి, బొట్టు పెట్టుకొని, వినాయకుడి పటం ముందు అగరుబత్తి వెలిగిస్తాడు. మ్యూజిక్ ప్లేయర్ ఆన్ చేసి తమిళ భక్తి గీతాలు పెడతాడు. దండం పెట్టుకొని పొయ్యి వెలిగిస్తాడు. ఏడు గంటలకల్లా వేడివేడి ఇడ్లీ, ఉప్మా, దోశె రెడీ అవుతాయి. మొదటి వాయిలోని ఇడ్లీ తీసి, అరటి ఆకులో పెట్టి, కొంచెం చెట్నీ వేసి దేవుడి పటం ముందు పెట్టి, వచ్చిన వాళ్లకు సప్లై చేయటం మొదలెడతాడు.

"టిఫిన్ సెంటరుకు వచ్చే వాళ్లల్లో కొందరు డైలీ కష్టమర్లుంటారు. వాళ్లల్లో ఎవరికి స్ట్రాంగ్ కాఫీ ఇవ్వాలో, ఎవరికి షుగర్‌లెస్ 'టీ' ఇవ్వాలో నటేశన్‌కు బాగా తెలుసు. ఎవరికి కావలసిన పదార్థాలు వాళ్లకి చిరునవ్వుతో సప్లై చేయటం నటేశన్ ప్రత్యేకత.

శుచిశుభ్రత ఉంటుందంటారు కొందరు.

ధరలు అందుబాటులో ఉంటాయంటారు మరికొందరు.

పదార్థాలు 'ఈటబుల్'గా ఉంటాయంటారు అందరూ."

అక్కడకు దగ్గరలో రెండు ప్రభుత్వ కార్యాలయాలూ, కూత వేటు దూరంలో రైతు బజారు వుండటం వలన ఉదయం, సాయంత్రం నటేశన్ టిఫిన్ బండి దగ్గర రద్దీగానే ఉంటుంది. ఉద్యోగస్తులు, ఆఫీసు పనుల మీద వచ్చే వాళ్లు, కూరగాయల కోసం రైతు బజారుకు వచ్చేవాళ్లు, ఆ రోడ్డెంటపోయే పాదచారులూ, వాహన చోదకులూ రకరకాల మనుషులతో కళకళలాడుతుంటుంది.

అక్కడకు దగ్గరలోని ప్రభుత్వ కార్యాలయంలో నేను జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్నాను. శ్రీమతి పుట్టింటికి వెళ్లినప్పుడు, పని ఒత్తిడి వలన ఇంట్లో టిఫిన్ కుదరనప్పుడు, ఆఫీసులోని కొలీగ్స్‌తోనూ కలిసి అప్పుడప్పుడు నటేశన్ టిఫిన్ సెంటరుకు వెళుతుంటాను.

కొందరికి కారప్పొడి, నెయ్యి వేసిన ఇడ్లీ అంటే ఇష్టం. మరికొందరికి ఉప్మా పెట్టిన పెసరట్టంటే ఇష్టం. ఇంకొందరికి వేడివేడి పూరీలంటే ఇష్టం. టిఫిన్ సెంటరుకు వచ్చే వాళ్లల్లో కొందరు డైలీ కస్టమర్లుంటారు. వాళ్లల్లో ఎవరికి స్ట్రాంగ్ కాఫీ ఇవ్వాలో, ఎవరికి షుగర్‌లెస్ 'టీ' ఇవ్వాలో నటేశన్‌కు బాగా తెలుసు. ఎవరికి కావలసిన పదార్థాలు వాళ్లకి చిరునవ్వుతో సప్లై చేయటం నటేశన్ ప్రత్యేకత.

శుచిశుభ్రత ఉంటుందంటారు కొందరు.

“ప్రపంచీకరణ, నగరీకరణల నేపథ్యంలో సంభవించిన పెనుమార్పులలో ఎన్నో బడుగు జీవితాలు ఛిద్రమయినాయి. కార్పొరేషన్ వాళ్లు రోడ్ల విస్తరణ పేరుతో పచ్చని చెట్లను నరికివేశారు. ఇప్పుడక్కడ జమ్మిచెట్టు లేదు. బోసు బొమ్మ లేదు. నటేశన్ టిఫిన్ బండి లేదు. ఫుట్‌పాత్‌ల పక్కనే వున్న చిన్న చిన్న అంగళ్లు, తోపుడు బళ్లూ మాయమైనాయి.”

ధరలు అందుబాటులో ఉంటాయంటారు మరికొందరు.

పదార్థాలు 'ఈటబుల్'గా ఉంటాయంటారు అందరూ.

టిఫిన్ బండి దగ్గర నటేశన్‌కు సాయంగా వెంకట్లు పనిచేస్తాడు. వెంకట్లుకు ఇరవై ఏళ్లుంటాయి. వాడు పుట్టు మూగ. వాడి సంభాషణంతా సైగల రూపంలో సాగుతుంది.

వెంకట్లు పదార్థాలు సప్లై చేస్తాడు. తిన్నవాళ్ల దగ్గర డబ్బులు వసూలు చేస్తాడు. కాఫీలూ, టీలూ కలుపుతాడు. వాడి మూగతనాన్ని చూసి కొందరు జాలిపడతారు. వాడి మూగసైగలకు కొందరు నవ్వుకుంటారు. కొందరైతే చనువుకొద్దీ వాడిని ఆటపట్టిస్తారు. 'మూగవైన నేమిలే, నగుమోమూ చాలులే' అంటూ పాటలు పాడతారు.

'ఏరా వెంకట్లూ! పెళ్లెప్పుడు చేసుకుంటావని' ఎవరైనా అడిగితే, వాడు మూడు వంకర్లు తిరిగి, తల వంచుకొని సిగ్గుపడతాడు. 'నీ మొహానికి పిల్లనెవరిస్తార్రా!' అంటే వాడు వెంటనే కోపం తెచ్చుకొని, మూగభాషలో వాళ్లపైన తగాదాకు సిద్ధమవుతాడు. వచ్చి నటేశన్‌కు వాళ్లపైన కంప్లైంటు చేస్తాడు.

పరిసరాలనూ, వ్యక్తులనూ గమనించటం, ఏవైనా నూతన ప్రదేశాలకు వెళ్లినప్పుడు, అక్కడి వింతలూ, విశేషాలూ అడిగి తెలుసుకోవటం నాకు చదువుకునే రోజుల్నుంచి అలవాటు. టిఫిన్ సెంటరుకు వెళ్లినప్పుడు 'టీ' తాగుతూ నటేశన్‌ను కబుర్లలోకి దించుతాను. తమిళ యాసతో నటేశన్ మాట్లాడే తెలుగు నన్నాకర్షిస్తుంది. కాస్త సమయం దొరికినప్పుడు నటేశన్ నాతో సరదాగా కబుర్లు చెబుతాడు. నేను రచయితననీ, అప్పుడప్పుడూ పత్రికలకు కథలు రాస్తుంటావనీ, నటేశన్‌కు నేనంటే అభిమానం. పత్రికలలో పడ్డ నా కథలను చదివించుకొని, ఆనందిస్తాడు. తను చూసిన వింతలూ, విశేషాలూ, తన జీవితంలో జరిగిన సంఘటలనూ చెప్పి 'కథ రాయండి సారూ!' అంటాడు.

సాయంత్రం నాలుగయ్యేసరికి కళాయి పెట్టి, వేడివేడి బజ్జీలూ, గారెలూ వేస్తాడు. అప్పుడప్పుడూ జిలేబి వేస్తాడు. అక్కడికి దగ్గరలో అపార్టుమెంట్ల నిర్మాణం జరుగుతూ ఉండటం వలన, అక్కడ పనిచేసే కూలి జనం ఆటవిడుపుగా నటేశన్ టిఫిన్ సెంటరుకు వస్తారు. టీలు తాగి, కాసేపు కబుర్లు చెప్పుకొని వెళ్లిపోతుంటారు.

ఆదివారం నటేశన్ టిఫిన్ సెంటరు లేకపోతే ఆ ప్రాంతమంతా బోసిపోయినట్లుంటుంది. ఒకప్పుడు దాన్ని 'బోసు బొమ్మ' సెంటరని పిలిచేవాళ్లు. తరువాత అది 'బాబాయ్ టిఫిన్ సెంటర్' అయింది.

కార్పొరేషన్ వాళ్ల మామూళ్లు, ఆ సెంటరులో డ్యూటీలో వున్న ట్రాఫిక్ పోలీసులకు ఫ్రీగా టిఫిన్‌లూ, పార్టీల పేరుతో చందాలు గుంజాటాలూ ఇవన్నీ మామూలే అంటాడు నటేశన్.

కాలక్రమంలో అనేక మార్పులు జరిగాయి.

ప్రపంచీకరణ, నగరీకరణల నేపథ్యంలో సంభవించిన పెనుమార్పులలో ఎన్నో బడుగు జీవితాలు ఛిద్రమయినాయి. కార్పొరేషన్ వాళ్లు రోడ్ల విస్తరణ పేరుతో పచ్చని చెట్లను నరికివేశారు. ఇప్పుడక్కడ జమ్మిచెట్టు లేదు. బోసు బొమ్మ లేదు. నటేశన్ టిఫిన్ బండి లేదు. ఫుట్‌పాత్‌ల పక్కనే వున్న చిన్న చిన్న అంగళ్లు, తోపుడు బళ్లూ మాయమైనాయి.

పెద్ద పెద్ద అపార్టుమెంట్లు వెలిశాయి.

మూతబడ్డ సినిమా థియేటర్ వున్నచోట ఆకాశమెత్తు షాపింగ్‌మాల్ వెలిసింది. అందులో గుండు సూది నుండి కంప్యూటర్ వరకూ అన్నీ దొరుకుతాయి. ఆకలి తీర్చటానికి ఫాస్ట్‌ఫుడ్ కార్నర్‌లు, బేకరీలు, కాలక్షేపం కోసం కేఫ్‌లు, ఐస్‌క్రీ పార్లర్లు వెలిశాయి.

ఇప్పుడది షాపింగ్‌మాల్ సెంటరయింది.

బతుకు శాశ్వతం కాదు.కానీ బతికినంతకాలం జానెడు పొట్ట నింపుకోవటానికి నటేశన్ లాంటివాళ్లు సాగించే జీవన సమరంలోనే నిజమైన శ్రామిక జీవన సౌందర్యం దాగి వుందనిపిస్తుంది నాకు.

ఒకప్పుడు కళకళలాడుతూ నటేశన్ టిఫిన్ బండి వున్నచోట, ఇప్పుడు నిర్జీవంగా ఉంది.

ఆ బతుకు బండిని నెట్టుకుంటూ నటేశన్, అతని వెంట రాజాలూ, వెంకట్లూ ఎటు వెళ్లారో తెలియదు.

రచనలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం 'స్నేహ' మీ రచనలకు ఆహ్వానం పలుకుతోంది. కథకులే కాదు! రచనల పట్ల ఆసక్తి వున్న, శక్తి వున్న వారెవరైనా మీ కలాలను కదిలించి రకరకాల అంశాలను పంపవచ్చు. మీ సమీప ప్రాంతాలలో నెలకొన్న దర్శనీయ స్థలాలు, మీరు చూసొచ్చిన పర్యాటక ప్రదేశాల గురించి రాయవచ్చు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో రికార్డులు సృష్టించిన, అవార్డులు పొందిన కళాకారులు, క్రీడాకారులు, చిత్రకారులు, సినీరంగానికి చెందినవారి గురించి రాసి పంపవచ్చు. మట్టిలో మాణిక్యాల్లా స్వశక్తితో విజయాలు సాధించినవారి గురించీ పంపవచ్చు. ఒకవేళ అవేవీ రాయలేకపోయినా సలహాలు, సూచనలు ఇచ్చినా సంతోషమే. వారికీ ఆహ్వానం. స్నేహ పత్రికలో ఇప్పుడు వస్తున్న అంశాలు కాకుండా ఇంకా సమయానుకూలంగా ఇదిగో ఇవి వస్తే బాగుంటాయి. అని మీకనిపిస్తే మాకు తెలియచేయండి. రచన స్థాయిని బట్టి పారితోషికం వుంటుంది.

-ఎడిటర్.

రచనలను పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1,
ఆజామాబాద్,
హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్:
snehaweekly.praja@gmail.com

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి

తన పారిస్ నోట్‌బుక్స్‌లో 'కూలీ, అద్దె, పరపతి (credit) లాభం, ప్రైవేటు ఆస్తి, Vs. కమ్యూనిజం గురించీ, 'పెట్టుబడికీ, శ్రమకూ వున్న సంబంధం గురించీ రాశాడు మార్క్స్. హెగెల్‌ను పునఃపరిశీలించాడు. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థకు పరమావధి డబ్బు సంపాదన (డబ్బుతో కొనగలిగే వస్తువులు). మానవ జీవిత లక్ష్యం 'డబ్బు' కావటం వల్ల, అతడికి ఇతర మనుషులతో వున్న సంబంధాలన్నీ వక్రీకరించబడ్డాయి. అంటే జీవితానికి, మానవ సంబంధాలకు అర్థమే మారిపోయింది. డబ్బే అందరి లక్ష్యం గనుక, ధనికుడు ఇష్టారాజ్యంగా బతకవచ్చు. ఆ పుస్తకంలోని ఒక పేరా:

'నేను కురూపిని. కాని నేను ధనికుణ్ణి గనుక ప్రపంచంలోని సుందరీమణులందర్నీ డబ్బుతో కొనగలను. అంటే డబ్బుంటే నేను కురూపినీ కాను. దానివల్ల నా అవలక్షణాన్ని, లోపాన్ని అధిగమించాను. నేను దుర్మార్గుణ్ణి. నీతి, నిజాయితీ

"మార్క్స్, జెన్నీకి రాసిన లేఖలు లభ్యం కావటం లేదుగాని, ఆమె రాసిన లేఖల ప్రకారం తను చాలా ఆందోళనలో గడిపింది. మార్క్స్ కార్యకలాపాల వల్ల పరపతి పెరిగింది. ట్రీయర్‌లో అందరూ అతడు బాగా సంపాదిస్తున్నాడనే అనుకున్నారు. తను కూడా హుందాగా, సంపన్నురాలిలాగా అందరి ముందూ ప్రవర్తించింది. కాని 'సక్సెస్ వేరు, సక్సెస్‌ఫుల్‌గా కనిపించటం వేరు' అంటుంది. కార్ల్‌కు ఉద్యోగం లేదు. ఎప్పుడు దొరుకుతుందో తెలియదు."

లేనివాణ్ణి. మూర్ఖుణ్ణి. కాని డబ్బుంటే నా అంత నిజాయితీపరుడు, సజ్జనుడు మరొకడు లేడంటారు. నాకు తెలివితేటలు లేవు. కాని డబ్బే నా తెలివితేటలు. పైగా, నాకు స్వయంగా తెలివితేటలు లేకపోతేనేం, అవి వున్నవాళ్లను డబ్బుతో కొనగలను. నా లోపాలన్నింటినీ కప్పేస్తుంది డబ్బు.'

మానవ సంబంధాలలో ఇంత వైషమ్యం ఎందుకేర్పడిందో హేతుబద్ధంగా విశ్లేషించాలనుకున్నాడు మార్క్స్. డబ్బు ఉత్పత్తి మీద పూర్తి నియంత్రణ వున్న పెట్టుబడిదారు తాను నిర్ణయించిన కూలీకి పని చెయ్యమనటం ద్వారా కార్మికుడిని dehumanize చేస్తున్నాడు. ఇదెలా ఉందంటే, ఒకడి దగ్గర బస్తాడు ధాన్యం ఉంది. కాని దాన్ని, తను నిర్ణయించిన ధరకు కాకుండా, కొనుగోలు చేసేవాడు అడిగిన ధరకు అమ్మినట్టుగా ఉంది. అమ్మకందారుకు తను అమ్మదలచుకున్న వస్తువుల ధరను నిర్ణయించే అధికారం లేదు. కొత్త పారిశ్రామిక సంబంధాలలో కార్మికుడికి తన శ్రామిక విలువ నిర్ణయించుకునే అవకాశం లేదు. ఫలితంగా, కార్మికుడు పరాయీకరణ చెందుతున్నాడు. ఒక నిర్జీవమైన వస్తువుగా మారిపోతున్నాడు. తన శ్రమ ఫలితం పెట్టుబడిదారుడు, ఫ్యాక్టరీ యజమానికి లాభాలార్జిస్తున్నది. కాని తనను మాత్రం అర్థాకలితో రోజులు గడపమంటున్నది. కనిపిస్తున్న సమాజమే తన సిద్ధాంతానికి సజీవసాక్ష్యం. పొట్టచేత పట్టుకొని గుంపులు గుంపులుగా నగరాలకు తరలివస్తున్నారు జనం. కాని అక్కడి పరిశ్రమల్లో ఫ్రెంచివాళ్లకే పేరు పెట్టారు. అదే పాపరిజం- జుఖుబజూవతీఐంఎ -శ్రమజీవి ముష్టివాడిగా మారటం.

గత ఇరవై ఏళ్లుగా, జీవన వ్యయం 17 శాతం పెరిగినప్పటికీ, వేతనాలు క్రమంగా తగ్గాయి. 1844లో ఆహార కొరత ఏర్పడింది. కాని సంపన్నులు మాత్రం పంచభక్ష్య పరమాన్నాలతో విందు లారగించారు. దేశ సంపద అంతా కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావటానికి ప్రభుత్వ విధానాలే కారణమని ప్రచారం జరిగింది. తను చదివిన ఆర్థిక శాస్త్రవేత్తల గ్రంథాలలో 'స్వేచ్ఛా విపణి సమాజ శ్రేయస్సుకు దోహదం చేస్తుంది. అన్ని వర్గాల ప్రజలూ లాభపడతారు' అని రాశారు. కాని విపణిని సంపన్నులు తమ స్వలాభం కోసమే వాడుకుంటున్నారన్న చేదు నిజాన్ని మార్క్స్ కళ్లారా చూశాడు.

రెండేళ్ల క్రితమే కొలోన్‌లో కమ్యూనిజం అనేది ఎప్పుడూ సాకారం కాలేని కల అని భావించిన మార్క్స్, సమాజ పునర్నిర్మాణానికి అది తప్ప గత్యంతరం లేదనే నిర్ధారణకు వచ్చాడు. మనుషులు సంపద సృష్టించాల్సిందే. కాని అది ప్రైవేట్ ఆస్తిగా మారకూడదు. మనుషులు శ్రమించాలి. కాని అది వాళ్లకూ, సమాజ హితానికే ఉపయోగపడాలి. యజమాని సొంత ఆస్తిగా రూపాంతరం చెందకూడదు. 'మనిషికీ ప్రకృతికీ మధ్య, మనిషికీ మనిషికీ మధ్య వున్న వైషమ్యాలను తొలగించే ఏకైక వ్యవస్థ కమ్యూనిజం' అని వివరించాడు. 'కమ్యూనిజంలో కళలు, సౌందర్య భావనలు అంతరిస్తాయని సందేహించాడు హైన్. కాని 'అందరికీ ఆకలి తీర్చుకునే హక్కుందని అంగీకరిస్తే, ఆ వాదన వల్ల హేతుబద్ధంగా వచ్చే పరిణామాలను కాదనలేం గదా!' అని కూడా అన్నాడు.

తమను తాము కమ్యూనిస్టులుగా భావించిన ఫ్రెంచి, జర్మన్ కార్మికులు (పారిస్‌లో వుంటున్న వారంతా) అవినీతిమయమైన ఈ ఆర్థిక వ్యవస్థను కూలదోయటానికి విప్లవం తప్ప మరో మార్గం లేదని నమ్మారు. వ్యవస్థ మారటం వల్ల నష్టపోయే సంపన్నులతో, పెట్టుబడిదారులతో (బూర్జువాలతో) చర్చలు జరపటం వల్ల ప్రయోజనం లేదు. ఈ పారిశ్రామిక భూస్వామ్య విధానం (ఈ నూతన ఆర్థిక వ్యవస్థకు కొందరు పెట్టిన పేరది.) కూడా, పాత భూస్వామ్య విధానంలాగా అంతం కావాలంటే హింస అనివార్యం. 'సొంత ఆస్తి అనే భావనను అంతమొందించడానికి కమ్యూనిజం అనే భావన చాలు. కాని నిజమైన వాస్తవమైన సొంత ఆస్తిని అంతమొందించటానికి కమ్యూనిస్టు చర్యను వాస్తవ రూపంలో అమలు చెయ్యాలి అని రాశాడు మార్క్స్. సరిగ్గా, ఆ సమయంలోనే, మార్క్స్ అభిప్రాయాలను పసిగట్టినట్టుగా, పారిస్‌లో హింస చెలరేగింది. ప్రష్యాలోని సిలేసియా ప్రాంతంలో కూడా తిరుగుబాట్లు జరిగినట్టుగా వార్తలొచ్చాయి. మార్క్స్‌కూ, పారిస్‌లోని కార్మికులకూ ఇంతకన్నా కావలసిందేమిటి!

తమ దుర్భర పరిస్థితులను సహించలేని నేత కార్మికులు కొందరు, కోపోద్రిక్తులై, ఇద్దరు పారిశ్రామికవేత్తలైన సోదరుల మీద దాడి చేశారు. 'దుర్మార్గులారా, మా నెత్తురు పీలుస్తున్న జలగల్లారా, మమ్మల్ని కబళిస్తున్న కొండచిలువల్లారా, మీరు మాకెట్లాగూ జీతాలివ్వరు. ఇదే మేమిచ్చేది" తీసుకోండి. అన్నది వాళ్ల నినాదం. అనేక రోజులుగా తిండి లేని ఆ కార్మికుల దాడిలో (పారిశ్రామికవేత్తల) ఇల్లు ధ్వంసమైంది. కాని వాళ్లు తప్పించుకున్నారు. ఆ మరుసటి రోజు, అయిదు వేలమంది నేత కార్మికులు తిరుగుబాటు చేశారు. తమ యజమానుల ఇళ్లలోకి ఫ్యాక్టరీల్లోకి ప్రవేశించి, యంత్రాలను ధ్వంసం చేశారు. లూటీకి పాల్పడ్డారు. యజమానుల రక్షణకు వచ్చిన ప్రష్యన్ సైన్యం తిరుగుబాటు దార్లమీద జరిపిన కాల్పుల్లో ముప్పై అయిదు మంది మరణించారు. రాళ్లూ, గొడ్డళ్లూ పట్టుకుని ఎదురుదాడి చేసింది కార్మికుల సైన్యం. కాని తెల్లారేసరికి అదనపు బలగాలొచ్చాయి. కార్మికులు పలాయనం చిత్తగించక తప్పలేదు. పారిపోలేని వాళ్లను అరెస్టు చేశారు.

ప్రష్యారాజు ఫ్రీడ్రిక్ విల్హెమ్.

" ప్రమాదకరమైన దారుల్లో మార్క్స్ ప్రయాణం కొనసాగినా, ధైర్యంగానే ఉండటానికి ప్రయత్నించింది జెన్నీ. దానికి కారణం కూతురు. ఇప్పుడామెకు ఇద్దరూ ముఖ్యమే. పారిస్‌లో కూతురు జబ్బు పడినప్పుడు ఎంత భయపడిందో! తమ ప్రేమకు సజీవ సాక్ష్యం జెన్నీచెన్. కనీసం కూతురు ఎదిగే వరకైనా తామిద్దరం క్షేమంగా ఉండగలిగితే! "

జర్మనీలోని కార్మికులు చేసిన తిరుగుబాట్లకు నాంది పలికింది నేత కార్మికులే. అప్పటికిది విఫలమైనప్పటికీ, కార్మికవర్గానికీ, ఆర్థిక సమస్యకూ, రాజ్యవ్యవస్థకూ ఉన్న సంబంధాన్ని గుర్తించాడు మార్క్స్. గతంలో లాగ, ఈ తిరుగుబాటును ప్రేరేపించింది మతము, జాతి సమస్య లేదా రాజ్యకాంక్ష లాంటి ఊహాజనిత భావనలు కావు. స్పష్టమైన, భౌతికమైన 'ఆకలి' సమస్య దీనికి మూలం. నేత కార్మికులు తన శత్రువును కూడా సరిగ్గానే ఎంచుకున్నారు. అదే భవిష్యత్తులో మరింత బలపడపోతున్న బూర్జువావర్గం. డబ్బు వీళ్ల దగ్గర వుంది గనక ప్రభుత్వ పగ్గాలు కూడా వీళ్ల చేతుల్లోనే ఉంటాయి. ఫ్రాన్సులో ఇలాగే జరిగింది. ప్రష్యాలో కూడా అదే జరుగుతుంది.

తమ స్వదేశంలో జరిగిన పరిణామాలతో ఉత్తేజం పొంది, సుమారు రెండు వందల మంది జర్మన్లు (మార్క్స్, హెర్వీగ్, హైన్‌లతో సహా) ప్రతి ఆదివారం సమావేశాలు నిర్వహించారు. ఇలా గుమిగూడిన వాళ్లంతా రాజులను చంపటం ఎలా, ధనవంతులనూ, మతాధికారులనూ ఎలా అణచివేయాలి వంటి 'భయంకరమైన' విషయాలు చర్చించారని రిపోర్టు చేశారు ఫ్రెంచి పోలీసులు. ఉదారవాద రష్యన్లు బకూనిన్, ఇతర్లతో తరచూ చర్చలు జరిపి ఆర్థిక సహాయం అర్థించాడు మార్క్స్. 1844 జూలైలో వర్గ చైతన్యం పెంచుకున్న ఒక కార్మికుడు, మేధావి, అనార్కిస్టు పియేర్ జోసెఫ్ ప్రూధో (pierre - joseph proudhon)ను కలిశాడు మార్క్స్. అప్పటికే 'ఆస్తి అంటే ఏమిటి?' అనే పుస్తకం రాసి 'ఆస్తి అంటే దొంగ సొత్తే' అని తేల్చాడు ప్రూధో. కొత్త ఆలోచనా విధానానికి నాంది పలికిందీ పుస్తకం. సొంత ఆస్తి వల్ల కలిగే సామాజిక దుష్ఫలితాలను ఇంత వివరంగా తెలియజెప్పిన మొదటి వ్యక్తి ప్రూధో అన్నాడు మార్క్స్.

1844లో 'ఫార్వర్డ్' పత్రికకు మార్క్స్ రాసిన వ్యాసాలతో పోల్చితే, దేశ ద్రోహ నేరం మోపబడిన రూగ్ పత్రికలోని వ్యాసాలు బాల సాహిత్యం లాంటివనే చెప్పాలి. పారిస్ నుండి వెలువడిన, సెన్సార్ కాని జర్మన్ వారపత్రిక ఇదొక్కటే. నిజానికి ఈ పత్రికకు పెట్టుబడి

పెట్టింది ఒక ప్రష్యన్ సంగీతకారుడు. హెర్వేగ్ ప్రియురాలు కౌంటెస్ డాగూల్ట్ అతడికి పారిస్‌లోని (జర్మన్) సోషలిస్టులు, కమ్యూనిస్టులందరినీ పరిచయం చేసింది. 'ఈ వెధవలంతా పత్రికలో రాయనీ. అలా, వాళ్లు తమ మరణశాసనం వాళ్లే రాసుకుంటున్నారు' అని కౌంటెస్‌కు చెప్పాడు ప్రష్యారాజు ఫ్రీడ్రిక్ విల్హెమ్.

ఈ పత్రికలోని ఒక ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రష్యన్ రాజు నుండి ఆర్థిక సహాయం పొందుతున్న ఒక జర్మన్ గూఢచారి బార్న్‌స్టెట్. మార్క్స్‌కు ఇతడి నేపథ్యం తెలిసే ఉంటుంది. అయినప్పటికీ పత్రికలో రాయటమే ముఖ్యమనుకుని వుంటాడు. ఏదేమైనా ఆరోజుల్లో ప్రభుత్వ వ్యతిరేక బృందాలలో గూఢచారులుండటం చాలా సామాన్యమైన విషయం.

ఈ పత్రికను స్థాపించిన హైన్రీష్ బెర్న్‌స్టైన్ ఇలా రాశాడు : 'సంపాదకీయ సమావేశాలకు

" ఉద్రిక్త వాతావరణంలో, పారిస్‌కు తిరిగి రావటానికి సిద్ధపడింది జెన్నీ. పరిస్థితులు మారిపోతున్నాయి. భర్త పక్కన ఉండాలి తను. కార్ల్‌కు రాసిన లేఖలో, 'ఎన్నాళ్లు మన కూతురు ఒంటరిగా ఆడుకోవాలి. ఇద్దరమూ దానికి ఇరుపక్కలా చేరి యుగళ గీతం పాడదాం' అంటుంది. "

పన్నెండు నుండి పద్నాలుగు మంది హాజరయ్యేవాళ్లు. అందరూ సిగార్లు కాలుస్తూనే ఉంటారు. గట్టిగా వాదించుకుంటారు. అరుచుకుంటారు. గదంతా పొగతో నిండిపోతుంది. కొత్తవాళ్లెవరైనా లోపలికి తొంగిచూసినా, ఆ పొగలో ఎవరెవరో పోల్చుకోవటం అసాధ్యం.' ఈ సమావేశాలకు మార్క్స్, హైన్, హెర్వేగ్, రూగ్, బకూనిన్, కవి జార్జి వీర్త్, మరో కమ్యూనిస్టు ఎవర్‌బెక్‌లు హాజరయ్యేవాళ్లు. రాసినందుకు ఎవరికీ ఏమీ పారితోషికం లభించేది కాదు.

ఈ కాలంలో మార్క్స్, జెన్నీకి రాసిన లేఖలు లభ్యం కావటం లేదుగాని, ఆమె రాసిన లేఖల ప్రకారం తను చాలా ఆందోళనలో గడిపింది. మార్క్స్ కార్యకలాపాల వల్ల పరపతి పెరిగింది. ట్రీయర్‌లో అందరూ అతడు బాగా సంపాదిస్తున్నాడనే అనుకున్నారు. తను కూడా హుందాగా, సంపన్నురాలిలాగా అందరి ముందూ ప్రవర్తించింది. కాని 'సక్సెస్ వేరు,



సక్సెస్‌ఫుల్‌గా కనిపించటం వేరు' అంటుంది. కార్ల్‌కు ఉద్యోగం లేదు. ఎప్పుడు దొరుకుతుందో తెలియదు.

ప్రమాదకరమైన దారుల్లో మార్క్స్ ప్రయాణం కొనసాగినా, ధైర్యంగానే ఉండటానికి ప్రయత్నించింది జెన్నీ. దానికి కారణం కూతురు. ఇప్పుడామెకు ఇద్దరూ ముఖ్యమే. పారిస్‌లో కూతురు జబ్బు పడినప్పుడు ఎంత భయపడిందో! తమ ప్రేమకు సజీవ సాక్ష్యం జెన్నీచెన్. కనీసం కూతురు ఎదిగే వరకైనా తామిద్దరం క్షేమంగా ఉండగలిగితే!

మార్క్స్ గురించి వార్తలు చదివినప్పుడల్లా ప్రతి వాక్యానికీ భయంతో వణికిపోయింది. కాని అతడు ఎంచుకున్న మార్గం అనివార్యం. అదే సరైనది. అందువల్ల అన్ని పరిణామాలకూ సిద్ధపడాల్సిందే. కార్ల్ బాగా రాస్తాడు. అతడు 'కోపం, ఆక్షేపణ, ద్వేషం తగ్గించుకుని, సింపుల్‌గా ఉన్నదున్నట్టుగా, కాస్త హాస్యం మేళవించి, సులభంగా, సరళంగా రాయగలిగితే ఇంకా బాగుంటుంది' ఒకసారి, తనకు తానే సమాధానం చెప్పుకున్నట్టుగా' గాడిదలారా, మీరు ఇంకా గట్టినేల మీద నిలుచున్నారనుకుంటున్నారా! (మార్క్స్ సృష్టించిన) భూకంపంతో ఈ సమాజం పునాదులు కదిలిపోతున్నాయి. మీ విశ్వాసాల భవంతులు కూలిపోతున్నాయి. మీరు అచంచలమూ, శాశ్వతమనుకున్నవన్నీ నేలమట్టమవుతున్నాయి' అని రాసుకుంది.

జెన్నీ ఈ మాటలు రాసిన నెలరోజుల తర్వాత ప్రష్యా నిజంగానే కంపించింది. జూన్‌లో సిలేసియాలో జరిగిన నేత కార్మికుల తిరుగుబాటు తర్వాత ఫ్రీడ్రిక్ విల్హెమ్ IV మీద జరిగిన హత్యా ప్రయత్నం విఫలమైంది. ఇప్పుడు కూడా జెన్నీ ప్రకారం దుండగుడు, రాజకీయ, కారణాలవల్లగాక, కేవలం ఆకలికి తాళలేక ఆ పని చేశాడు. కార్ల్‌కు రాసిన ఓ లేఖలో అ నేరస్తుణ్ణి ఆమె వర్ణించింది. "మూడు రోజులుగా పస్తులున్న అతడు బెర్లిన్ వీధుల్లో ముష్టి ఎత్తుకున్నాడు. అంటే హత్యా ప్రయత్నానికి భౌతిక కారణాలున్నాయి. ఇక, సామాజిక విప్లవానికి బీజాలు పడినట్టే. కాని ప్రజలు ఈ విషయం గ్రహించనట్టు లేరు. చర్చిలకు వెళ్లి, రాజుగారు క్షేమంగా ఉన్నందుకు ప్రార్థనలు చేస్తున్నారు".

జెన్నీ రాసిన ఈ లేఖను ఆగస్టు 10, 1844 నాడు తన పత్రికలో 'ఒక జర్మన్ లేడీ' రాసిన లేఖగా ప్రచురించాడు మార్క్స్. ఇంకేముంది ఈ పత్రిక కూడా జర్మన్ అధికారుల దృష్టిలో పడింది. అప్పటికే వాళ్లు, హత్యా ప్రయత్నం గురించి కూపీ లాగే పనిలో ఉన్నారు. పైగా పత్రికలో ప్రభుత్వ గూఢచారులున్నారు. ఈ ప్రచురణ తర్వాత, రాజుగారు దైవాంశ సంభూతుడు కాదనీ, మానవ మాత్రుడనీ స్పష్టమైంది. పత్రిక గురించి ప్రష్యన్ ప్రభుత్వం, ఫ్రెంచి అధికారుల మీద ఒత్తిడి తెచ్చింది. పత్రిక లైసెన్స్ గురించి వివాదం లేవదీశారు. ఎడిటర్ ఇన్‌ఛీఫ్‌ను రెండు నెలలపాటు జైల్లో పెట్టారు. పత్రికలో పనిచేసే మిగతా సిబ్బంది కూడా పరిణామాలను ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నారు.

ఈ ఉద్రిక్త వాతావరణంలో, పారిస్‌కు తిరిగి రావటానికి సిద్ధపడింది జెన్నీ. పరిస్థితులు మారిపోతున్నాయి. భర్త పక్కన ఉండాలి తను. కార్ల్‌కు రాసిన లేఖలో, 'ఎన్నాళ్లు మన కూతురు ఒంటరిగా ఆడుకోవాలి. ఇద్దరమూ దానికి ఇరుపక్కలా చేరి యుగళ గీతం పాడదాం' అంటుంది.

అన్ని విషమ పరిస్థితుల్లోనూ, కార్ల్ పక్కనే నిలిచింది జెన్నీ. లోకమంతా ఆయన్ను వ్యతిరేకించినా ఆమె సమర్థించింది. అతడు ప్రమాదంలో చిక్కుకుంటే రక్షించింది. ఆర్థిక సమస్యలు ఇప్పుడామె దృష్టికే రాలేదు. జెన్నీ లేఖ చేరిన కొద్ది రోజులకే మార్క్స్‌కు మరొక వ్యక్తితో పరిచయమైంది. అతడే ఆయన జీవిత కాల మిత్రుడు ఫ్రెడెరిక్ ఎంగెల్స్.

సశేషం

▪ ఫోన్: 91776 18708

నవ్వుల్ - పువ్వుల్

బోణి



జ్యోతిష్కుడు : ఈ ఏడాది మీరు డబ్బు బాగా సంపాదిస్తారు అన్నాడు జ్యోతిష్కుడు సుబ్బారావుతో..!

సుబ్బారావు : అదేదో మీతోనే మొదలుపెడతాను. మర్యాదగా మీ వద్దనున్న డబ్బులు బయటకు తీయండి రక్కున అన్నాడు సుబ్బారావు.

బాధపడితే



భర్త : పిల్లికి కూడా బిచ్చం వేయవా, అదేం...?

భార్య : దానికేస్తే మిగిలిన జంతువులు బాధపడతాయని...!

మాయ

శివ : వాడు ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే రకంరా...!

శ్రీను : వాడిని ఆవులించమని ఎవడు చెప్పాడు, వీడిని పేగులు లెక్కపెట్టమని ఎవడు చెప్పాడు... అంతా ఏమిటో ఈ మాయ...!

ముహూర్తం



పెళ్లికొడుకు : నా పెళ్లికి మంచి ముహూర్తం పెట్టండి పంతులుగారూ..!

పంతులు : మంచి ముహూర్తం పెడితే, పెళ్లి చేసుకుని ఉద్ధరించేద్దామనే, అది నీ వల్లకాదు.

రుచి



భర్త : వంటలో అన్నీ వేశానంటున్నావ్. అయినా రుచి లేదేం...?

భార్య : అయ్యో, అదొక్కటే వెయ్యడం మరిచిపోయానండీ...!

దయ



డాక్టర్ : నేను చేయవలసిన వైద్యం చేశా, ఆపై దేవుడి దయ..!

పేషెంట్ : ఆ దేవుడి దయ, మీ మీదా, నామీదా...?

కలిపేసుకుంటే



కస్టమర్ : ఏంటీ, కూరలో ఉప్పు తక్కువయిందీ...!

సర్వర్ : చారులో ఎక్కువగా వుంది కానీ, దానిలోంచి తీసుకుని, దీనిలో వేసుకోండి...!

బుద్ధి

తండ్రి : నీకసలు బుద్ధి లేదురా...!

కొడుకు : వుంది, కావాలంటే నా మెదడులో చూసుకో...!

ఫ్రీగానే...!



డాక్టర్ : ఏవయ్యా, నీకు బిపి ఎక్కువగా ఉంది. అన్నాడు డాక్టర్...

పేషెంట్ : కావాలంటే కొంచెం తీసుకోండి రక్కున అన్నాడు పేషెంట్...!

తరతరాలకి



చైతన్య : మీ తాతగారు మూడు తరాలకు సరిపడా ఆస్తులు సంపాదించారంటున్నావుగా మరి సంతోషించక, దిగులెందుకు...?

గణేష్ : అది సంక్రమించేది, నా మనుమడి తరం నుంచట..!

- ముత్యాల శ్రీశరత్‌బాబు,

ఫోన్ నెం : 9963298921

ఆపద సమయాల్లో ఆదుకునే 'యాప్'

నిన్నటి వరకు ఫోన్ అంటే మాట్లాడుకోవడానికి, గేమ్స్ ఆడుకోవడానికి, నేస్తాలకు సందేశాలు పంపుకోవడానికి, విసుగనిపిస్తే పాటలు వినడానికి ఉపయోగపడేది. కానీ ఇవాళ ఫోన్ అరచేతిలో ప్రపంచాన్నే చూపిస్తోంది. అత్యవసర సమయాల్లో సాయంగా వుంటోంది. మరీ ముఖ్యంగా మహిళలు, పిల్లలకు విపత్కర పరిస్థితి ఎదురైనా ... సమాచారం అందించడానికి సాయం పొందడానికి స్మార్ట్ ఫోన్ , అందులోని యాప్స్ ఉపయోగపడుతున్నాయి. అలాంటి కొన్ని రకాల యాప్స్ గురించి...

రక్షించండి

'స్క్రీమ్ అలారం' అనే యాప్ మీద క్లిక్ చేస్తే చాలు. వెంటనే మహిళా గొంతుతో 'కాపాడండి' అంటూ పెద్దగా అరుపులు వినిపిస్తాయి. మొబైల్ పెద్దగా శబ్దం చేస్తూ ఆ చుట్టుపక్కల ఉన్నవారిని అప్రమత్తం చేస్తుంది. ఆండ్రాయిడ్ ఫోన్‌పై మాత్రమే అందుబాటులో వుంది.

'వైడబ్ల్యూసీఏ సేఫ్టీ అలెర్ట్' యాప్‌ని క్లిక్ చేసినా లేదా మొబైల్‌ని షేక్ చేసినా వెంటనే పెద్ద శబ్దం వెలువడుతుంది. ఫలితంగా ఆ చుట్టుపక్కల వున్నవాళ్లని అప్రమత్తం చేయడంతోపాటు వారి దృష్టిని ఆకర్షిస్తుంది. ఆండ్రాయిడ్ వినియోగదారులు ఈ యాప్‌ని ఉపయోగించుకోవచ్చు.

క్యాబ్‌లో చెలో



బాధితురాలు ఆపదలో ఉన్న ప్రదేశానికి సమీపంలో ఎక్కడెక్కడ ట్యాక్సీ స్టాండ్లు వున్నాయో తెలుసుకోవచ్చు. అంతేకాకుండా వెంటనే ఓ ట్యాక్సీని మాట్లాడుకుని అక్కడి నుంచి తప్పించుకునేందుకు 'క్యాబ్ ఫర్ మి' యాప్ వీలు కల్పిస్తుంది. తద్వారా బాధితురాలు వీలైనంత తక్కువ సమయంలోనే ఆపద నుంచి బయటపడే ఆస్కారం వుంటుంది. కాబట్టి మనం ప్రయాణంలో ఉన్నప్పుడు కావాల్సిన సమాచారాన్ని ఈ యాప్ ద్వారా పొందచ్చు. ఆండ్రాయిడ్, ఐఫోన్‌లపై ఈ యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు.

ప్రయాణంలో తోడు

మెట్రో నగరాలలో కొత్తగానో, ఒంటరిగానో ప్రయాణం చేయాల్సి వస్తే 'యాత్రా మిత్ర్' సహాయపడుతుంది. సన్నిహితుల ఫోన్ నెంబర్లు ఫీడ్ చేసుకుంటే, మీరు ఎక్కడి నుండి ఎక్కడికి ప్రయాణం చేస్తున్నదీ సులువుగా తెలుస్తుంది. ఉదాహరణకు ఆటో ప్రయాణం అయితే, చేరవలసిన గమ్యానికి డ్రైవర్ కచ్చితంగా తీసుకెళ్తున్నాడా? దారి తప్పించాడా? అన్న విషయాన్ని ఇందులోని బ్రౌజర్ ద్వారా తెలుసుకోవచ్చు. దారి తప్పించినట్టు అనుమానం కలిగితే పేనిక్ బటన్ నొక్కితే ప్రమాద సంకేతాలు క్షణాల్లో సంరక్షకులకు చేరతాయి. అంతేకాదు! గమ్యం చేరడానికి మీటర్ ఎంత చెల్లించాలో కూడా తెలుస్తుంది. మనం ఎక్కడైతే వున్నామో ఆ ప్రాంతానికి సమీపంలోని పోలీస్ స్టేషన్లు, బస్ స్టేషన్లు, హోటళ్లు, ఆస్పత్రుల సమాచారమూ ఇందులో నిక్షిప్తమై ఉంటుంది.

సాయం కావాలి

'హెల్ప్ మి ఆన్ మొబైల్' యాప్ రెండు సేవల్ని అందిస్తుంది. ఒకటి 'ఐయామ్ హియర్' కాగా మరొకటి 'ఐ నీడ్ హెల్ప్'. ఈ అప్లికేషన్ ద్వారా అవసరాన్ని బట్టి ఆప్తమిత్రులకు సందేశాల్ని పంపించే వీలుంటుంది. ఆండ్రాయిడ్ యూజర్లు ఈ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని తమ మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు.

ఎక్కడ వున్నా...

లైఫ్ 360! కుటుంబానికి అత్యంత ఉపయోగకరమైన యాప్. ఇది స్మార్ట్ ఫోన్‌లో జీపీఎస్ ఆధారంగా పనిచేస్తుంది. కుటుంబ సభ్యులంతా ఈ యాప్‌ని వేసుకుంటే... ఎవరు ఎక్కడ ఉన్నారో ఎప్పుడైనా తెలుసుకోవచ్చు. వీరే కాదు! తమ సన్నిహితులు, స్నేహితుల పేరుతో వేరే గ్రూప్స్ కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ యాప్‌ని ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇందులో ఛాటింగ్ కూడా ఉచితమే. మొబైల్ పోయినా జీపీఎస్ ద్వారా గుర్తించి... ఏ ప్రదేశంలో ఉందో తెలుసుకోవచ్చు.

ఏం వండాలబ్బా!

ఇది ప్రతి రోజూ ఉండే సమస్యే. ఒంటరులకు, గృహిణులకు పెద్ద పజిల్ ఇది. ఏదైనా కొత్త రకం వండి పెట్టాలి అనుకునే వారికి ' కుక్ వైజ్ మీ' యాప్ మంచి ఉపయోగకారి. మీరు కూడా అత్యంత ప్రజాదరణ వంటకాలను బ్రౌజ్ చేసి తెలుసుకోవచ్చు. ఈ యాప్ కేవలం ఐఫోన్‌కు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

ఆపద కాలంలో...



'విత్ యు' అనేది ఒక ఎమర్జెన్సీ యాప్. మనం ఆపదలో ఉన్నప్పుడు మీ స్మార్ట్ ఫోన్ పవర్ బటన్‌ని రెండుసార్లు నొక్కితే చాలు. '(నేను ప్రమాదంలో వున్నాను. సాయం కావాలి. నేనున్న చోటికి రావాలి...' అని మీ వాళ్లకు సందేశం పంపుతుంది. యాప్‌లో నమోదు చేసుకున్న వారికి .... ప్రతి రెండు నిమిషాలకు ఒకసారి సమాచారం వెళ్తుంది. దీంతో వాళ్లు వెంటనే అలెర్ట్ అవుతారు. సందేశంతోపాటు మనం ఏ ప్రదేశంలో ఉన్నామో గూగుల్ మ్యాప్స్ లొకేషన్ లింక్ కూడా పంపుతుంది. ప్రతి రెండు నిమిషాలకు ఒకసారి మనం ఎక్కడున్నామో అప్ డేట్ అవుతూ ఉంటుంది. దీంతో మనం వున్న ప్రదేశాన్ని మన వాళ్లు సులభంగా తెలుసుకోవచ్చు. ఎవరెవరికి సమాచారం వెళ్లాలో వారి మొబైల్ నెంబర్లు ముందుగానే ఈ యాప్‌లో సేవ్ చేయాలన్నమాట. 'గుమ్రాహ్' అనే కంపెనీ రూపొందించిన ఈ యాప్ ... అత్యవసర సమయాల్లో ... ఎలా బయటపడాలో సూచనలు కూడా అందిస్తుంది.

మిస్సింగ్

తమ సంబంధీకులు ఎక్కడ ఉన్నారో తెలుసుకునేందుకు ఉపయోగపడే యాప్ 'అలెర్ట్. అజ్'. మరీ ముఖ్యంగా ఆపద సమయాల్లో బాధితులు ఎక్కడున్నారో సులభంగా గుర్తించవవచ్చు. ప్రత్యేకించి ఇది చిన్న పిల్లలు, మహిళలు, కాలేజీ విద్యార్థినులకు బాగా ఉపయోగకరం. బ్లాక్ బెర్రీ ఫోన్‌లో మాత్రమే దీనిని ఉపయోగించే అవకాశం వుంది.

కాబోయే తల్లులకు...

మదర్స్ వరల్డ్ యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఉచితంగా డౌన్లోడ్ చేయవచ్చు. మీరు గర్భం దాల్చిన దగ్గర నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తుంది. వ్యక్తిగతంగా మహిళలకు చాలా ఉపయోగపడుతుంది. దీనిలో వచ్చే సమాచారం ఖచ్చితమైనదని నిపుణుల మాట కూడా

నిర్భయ

2012 వెళ్తూ వెళ్తూ ఓ చేదు జ్ఞాపకాన్ని ఇచ్చి వెళ్లింది. ఢిల్లీలో ఆరుగురు కామాంధుల చేతిలో అత్యాచారానికి గురై ఆపై వారి పైశాచికత్వం కారణంగానే ఓ మెడిసిన్ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇకపై ఇటువంటి నేరాలు మళ్లీ పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం నిర్భయ చట్టాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ తర్వాత కాలంలో అదే 'నిర్భయ' పేరుతో మహిళలకు ఓ రక్షణ కవచంలా నిలిచేందుకు 'నిర్భయ' మొబైల్ యాప్‌ను రూపొందించింది. మహిళలు ఆపదలో ఉన్నప్పుడు ఈ నిర్భయ యాప్‌ని ఆన్ చేసి మొబైల్‌ని షేక్ చేస్తే చాలు! ముందుగా సెలక్ట్ చేసుకున్న నెంబర్లకి ఫోన్ కాల్‌తో సహా ఓ మెసేజ్ వెళ్లిపోతుంది. ఈ యాప్‌లో ఉన్న మరో ప్రత్యేకత ఏంటంటే... మొదట సందేశం పంపిన చోటు నుంచి బాధితురాలు మరో దిశలో ప్రయాణిస్తున్నట్లయితే ప్రతి 300 మీటర్లకి బాధితురాలు వున్న ప్రదేశంతో సహా సందేశం సెలక్టెడ్ కాంటాక్స్‌కి వెళు_ంది. అయితే ఆండ్రాయిడ్ ఫోన్లలో మాత్రమే ఈ యాప్ అందుబాటులో ఉంది.

ఇది కూడా నిర్భయ లాంటి మరో యాప్ 'ఫైట్ బ్యాక్'. ఒక్కసారి టచ్ చేస్తే, వెంటనే మీ వాళ్లకు కాల్ వెళ్లిపోతుంది. మిస్సింగ్ కేసుల్లో తమకు ఈ అప్లికేషన్ ఉపయోగపడుతోందని పోలీసులు సైతం చెబుతున్నారు. ఇంటర్నెట్‌తో కనెక్టయ్యి ఉండే ఈ అప్లికేషన్... బాధితులు వున్న ప్రదేశాన్ని గుర్తించడానికి ఉపయోగపడుతుంది.

- అనంతోజు మోహన్ కృష్ణ

బాల్యం ఒక అద్భుత ప్రపంచం. అపురూప అనుభవాల నిలయం. అది ఆటపాటల ఉద్యానవనం. ఏ చీకూచింతా లేని ఆహ్లాద ప్రయాణం. కథాకమనీయాల కలబోత .. ఆనందానుభూతుల తలపోత! మరి బాల్యం ఇప్పుడు ఇలా ఉందా? అంటే- ఉంది అని చెప్పలేం. బాల్యమూ, కెరీరిజం కలగలిసి సాగుతున్నందువల్ల - బాల్యం బాల్య మాధుర్యాన్ని కోల్పోతోంది. భవిష్యత్తు వైపు పరుగు పేరుతో బంగారు బాల్యాన్ని మిస్సవుతోంది.

కోల్పోతున్న బాల్యం



- సత్యాజీ

▪ ఫోన్: 94900 99167

ఇప్పుడు అన్నీ మారాయి. బాల్యం కూడా మారింది. ఇప్పటి బాల్యం ఒకప్పటి బాల్యాన్ని కోల్పోయింది! బాల్యంలోనే అందమైన బాధ్యతలు వచ్చి చేరిపోయాయి. అది బాధ్యతలా ఉండదు. బరువులా ఉండదు. చుట్టూ అందమైన రేపరు తొడిగిన ఖరీదైన పాత్రలా ఉంటుంది. అది ఎక్కడా పడి పోకుండా మోయాలి. ఆటలాడుకో .. పాట పాడుకో ... ఏమైనా చేసుకో! భుజమ్మీద అదృశ్యంగా ఉన్న కలల పాత్ర ఒలికిపోకూడదు. చేతికి కనపడకుండా కట్టిన గోల్ ట్యాగు జారిపోకూడదు. ఈ పసిపాదాల నుంచి లక్ష్య పర్వతం వరకూ గీసిన గిరి దాటిపోకూడదు. ఈ 'కూడని' వలయాలు దాటకుండా ఎన్ని పరుగులైనా తీయొచ్చు! ఎంత బాల్యాన్ని అయినా అనుభవించవచ్చు!

'మీ పిల్లాడు మీ ఇంట్లో ఉన్నట్టు ఉండకూడదు. మా స్కూలుకు తగ్గట్టుగా ఉండాలి.' 'మీ పిల్లాడిని మా చేతిలో పెట్టండి. మీ కలలు నెరవేర్చే పూచీ మాది..' ఇలా భరోసా ఇచ్చే కార్పొ'రేటు' స్కూళ్లకు ఇప్పుడు డిమాండు ఎక్కువగా ఉంది. భవిష్యత్తు అంటే ఆషామాషీ కాదు.. గ్యారంటీ కావాలి! గెలిచిన ఉదంతాలు కావాలి! విక్టరీ వేళ్ల విజయహాసం చేసే హోర్డింగులు ఉన్న స్కూళ్లు కావాలి! ఇవన్నీ చూశాక.. వడపోశాక 'మంచి' స్కూలును ఎంపిక చేస్తున్నారు తల్లిదండ్రులు. ఈ ధోరణి నగరాలకు, పట్టణాలకు మాత్రమే పరిమితం కాదు.. మండల కేంద్రాలకూ పాకింది!

చదువుల పరుగులో ...

ఈ చదువుల పోటీలో మొట్ట మొదట ఓడిపోయేది బాల్యం. పాపం .. బాల్యానికి పరుగులు తెలుసు కానీ, పోటీ తెలీదు. కేరింతలు తెలుసు కానీ, ర్యాంకులు తెలీవు. అలా తెలియకపోవడం వల్ల – బాల్యం నెమ్మదిగా నెమ్మదించిపోతుంది. పసిప్రాయపు పరవళ్లు ఒక పరిధికే పరిమితం అవుతున్నాయి.

ఒకప్పుడు ఐదేళ్లు నిండితేనే బడికి వెళ్లాలి. అఆలు అయినా, మరొకటైనా అప్పుడే నేర్చుకోవాలి. ఇప్పుడు ఆ పద్ధతి పూర్తిగా మారిపోయింది. రెండున్నర, మూడేళ్లకే ప్లేస్కూళ్లతో చదువు మొదలవుతుంది. ఫస్టు క్లాసులో చేరటానికి యుకెజి, యుకెజిలో ఇమడటానికి ఎల్‌కెజి, ఎల్‌కెజికి అలవాటు పడటానికి నర్సరీ ... వచ్చేశాయి! అంటే సహజ బాల్యం ఐదేళ్ల నుంచి రెండున్నర ఏళ్లకు – అంటే సగానికి తగ్గిపోయింది. మాటలు, పాటలు, ముద్దులు, గోరుముద్దలతో ఎదగాల్సిన బాల్యం శిక్షణ దశలోకి వెళ్లిపోయింది. మన నిబంధనల ప్రకారం ... ఇప్పటికీ విద్యాభ్యాసం ఐదేళ్ల నుంచే

ప్రారంభం కావాలి. కానీ, అనధికారంగా వేలాది స్కూళ్లు అంతకుముందు నుంచే శిక్షణ గరపుతున్నాయి.

ముందు కలలు కని, ఆ తరువాత పిల్లలను కనమని కార్పొరేట్ గురూలు బోధిస్తారు. ఎందుకంటే– ప్రతిదీ ప్రణాళిక ప్రకారం జరగాలి. లెక్క తప్పకుండా నడవాలి. నడక ఇంకా నేర్చుకోకముందే లక్ష్య నిర్దేశనం అయిపోవాలి. ఈ ఆకాంక్షలు అసలు సిసలు బాల్యాన్ని పిల్లలకు అందని ద్రాక్షగా మార్చేస్తున్నాయి.

పిల్లలపై అమిత ప్రేమ .. కానీ ..,

మరి ఈతరం అమ్మానాన్నలకు పిల్లలంటే ప్రేమ లేదా? కావాలనే లక్ష్యాలను రుద్దేస్తున్నారా? అంటే– ముమ్మాటికీ కాదు. నిజానికి ఎప్పటికంటే ఇప్పుడు పిల్లల మీద శ్రద్ధ అమితంగా పెరిగింది. చిన్ని కుటుంబాలు, ఒకరు లేదా ఇద్దరు సంతానం వంటి కారణాలతో – పిల్లలను బాగా చదివించి, మంచి భవిష్యత్తును ఇవ్వాలని ఆకాంక్ష అందరిలో ఉంది. ఎలా అయితే అలా, ఎలా చదివితే అలా అని అనుకోవడం పోయింది. 'బాగా చదవాలి. గొప్పగా రాణించాలి.' అనే తపన జీర్ణించుకుపోయింది. ఎంత వెచ్చించి అయినా మంచి చదువు ఇవ్వాలనే వాతావరణం ఏర్పడింది.

తల్లిదండ్రుల్లో రగులుతున్న ఈ తపనే అనేక టెక్నో స్కూళ్లకు, కార్పొరేట్ స్కూళ్లకూ ఆలంబన. గడిచిన ఐదేళ్లలో చిన్న చిన్న పట్టణాల్లో కూడా కార్పొరేట్ స్కూళ్లు వెలిశాయి. ర్యాంకులే కొలబద్దగా ఈ స్కూళ్లలో విద్యాబోధన సాగుతుంది. 'చదువు చదువు నిరంతర చదువు' ... అన్ని పీరియడ్లలోనూ ఇదే ఒరవడి. హైస్కూలు విద్యార్థులకైతే రాత్రి 7, 8 గంటల వరకూ తరగతులను నిర్వహించటం పరిపాటి అయింది.

రోజంతా చదువు అనే ధోరణిని చాలామంది తల్లిదండ్రులకు కూడా ఇబ్బందిగానే అనిపిస్తుంది. కానీ, అలా కాకుంటే తమ పిల్లలు వెనకబడిపోతారేమో భయం కూడా వెంటాడుతుంది. ఇంత రుద్దకుండా మంచి మార్కులు రప్పించే స్కూళ్లు ఏమైనా ఉన్నాయా? అని చూస్తే చాలాచోట్ల మార్గం కనిపించదు. దీంతో, రాజీ పడాల్సిన పరిస్థితి!

ఆటపాటలు హొరెత్తిన రోజులు ...

ఇరవయ్యేళ్ల క్రితం వరకూ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల్లోనే చదువులు సాగేవి. ఇంత భారీ ఖర్చు ఉండేది కాదు. చుట్టుపక్కల ఊళ్ల పిల్లలందరూ ఒకేచోట చదివేవారు. ఆస్తిపాస్తులు, సంపాదనలతో సంబంధం ఉండేది కాదు. అందరి మధ్యా స్నేహాలు నెలకొనేవి. విశాలమైన ఆటస్థలాలు ఉండేవి. రోజూ సాయంత్రం ఆటలు ఉండేవి. బడి విడిచిన తరువాత బోలెడు సమయం ఉండేది. వీధిలోని పిల్లలందరూ రకరకాల ఆటలాడుకునేవారు. ఆసక్తి, ఆడే శక్తీ ఉన్నవారంతా పాల్గొనవచ్చు. ఆకలేసేవరకూ, అమ్మ పిలిచేవరకూ ఆటలకు విరామం లేదు. ఇదే ఆడు, ఇంతే ఆడు అనే ఆంక్షలు లేవు. పెద్ద పిల్లలే శిక్షకులు. చిన్నవాళ్లు నేర్చుకునేవారు. దెబ్బ తగిలితే ఆటలో అరటిపండు. ఎవరికి ఎవరూ ఫీజు చెల్లించక్కర్లేదు.

స్కూలు యాజమాన్యం, ఉపాధ్యాయులు

- **స్కూలుకు ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. దానిని రోజూ ఉపయోగించాలి.**
- **మంచి మార్కులు తెచ్చుకునే పిల్లలను ప్రోత్సహించినట్టే- ఆటల్లో బాగా రాణించేవారినీ అభినందించాలి.**
- **ఆడించటం అనేది శిక్షలా ఉండకూడదు. ప్రోత్సాహకరంగా, ఆహ్లాదకరంగా ఉండాలి.**
- **స్కూలు బ్యాగుల బరువు తగ్గించాలి. ఇంటికి అవసరంలేని పుస్తకాలు తరగతి గదిలోనే భద్రపరచుకునే ఏర్పాటు చేయాలి.**
- **తరచుగా పిల్లలకు పాఠ్యేతర అంశాల్లో పోటీలు పెట్టాలి.**

కాలువలో ఈత, కబడ్డీ కూత, కళ్లగంతల ఆట, కోతికొమ్మచ్చి, గురి చూసి కొట్టడం, ఒంటి కాలితో మెక్కడం, చింతపిక్కటాట, చిల్లపెంకులాట, కర్రబిళ్లాట, కోడిపుంజులాట .. ఒకటా రెండా? బోలెడు. పిల్లల సంఖ్యను బట్టి, ఆడే వేళను బట్టి, అప్పటి వాతావరణాన్ని బట్టి ... వీధిలోనైనా, ఇళ్ల అరుగుల మీదైనా ... ఆటలు హాయిగా సాగిపోయేవి. మెదడుకు పదును పెట్టే ఆటలు కొన్నయితే ... ఒంటికి బలాన్ని ఒసగే ఆటలు మరికొన్ని ..! జలపాతాల హెూరువలె .. పిల్లగాలుల ఈలల వలె .. పూలతేరుల సొగసు వలె ... లేగదూడల గెంతులల్లే ... బాల్యం ఆ ఆటపాటల్లో పరవశించి, వికసించేది!

పెట్టుబడితో బాల్యం బలి!

ప్రైవేటు విద్య రంగంలోకి వచ్చిన తరువాత పోటీ వాతావరణం నెలకొంది. చదువు ఖరీదైపోయింది. ఎంత భవిష్యత్తుకు అంత పెట్టుబడి అన్న ధోరణి వచ్చింది. పెట్టుబడి ఎక్కడ పెట్టినా, ఎవరి మీద పెట్టినా అది రాబడిని కోరుకుంటుంది. లాభాన్ని ఆశిస్తుంది. విద్యాసంస్థల అధిపతులు కూడా పెట్టుబడి పెట్టి, వాటిని అభివృద్ధి చేశారు.. తల్లిదండ్రులు పిల్లల మీద వెచ్చించారు. చదువులో డబ్బు కీలకం అయిపోయింది. లాభాలను రాబట్టే గురుతర బాధ్యత పిల్లల మీద పడింది. ఆటలకు, పాటలకు సమయం ఆటోమేటిగ్గా తగ్గిపోయింది. చాలాచోట్ల పూర్తిగా హరించుకుపోయింది. పిల్లలు ఉన్నారు కానీ, వాళ్లకి బాల్యం లేకుండాపోయింది.

పిల్లలకు చిన్నప్పుడే లక్ష్యాలు ఏర్పడిపోతున్నాయి. 'నేను డాక్టరవుతాను..' 'నేను ఫలానా ఇంజనీరుని అవుతాను...' 'నేను అమెరికా వెళతాను...' వంటి మాటలను నేడు చాలామంది పిల్లలు చాలా ధైర్యంగా చెబుతున్నారు. అమ్మానాన్నల కలలు, వాళ్లు వ్యక్తపరిచిన ఆకాంక్షలు, తెలిసినవారి విజయ ప్రస్థానాలూ ... పిల్లల్లో ఒక గాఢమైన ముద్ర వేస్తున్నాయి. దీంతో, చాలామంది పిల్లలు అకాలంగా, మధ్యంతరంగా బాల్యాన్ని విడిచేసి– లక్ష్య కవచం తొడుక్కుంటున్నారు.

అన్నీ కావాలి ..

విపరీత పోటీ ధోరణి బాల్యాన్ని హరించి వేయడంపై మేధావులు చాలాకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. విరామం లేని బోధన, నిరంతర పఠనం వల్ల పిల్లల్లో శారీరక, మానసిక వికాసం తగినంత ఉండదని పరిశోధనలు చెబుతున్నాయి. ఆటలు, పాటలు, ఇతర సృజనాత్మక ప్రక్రియలు పిల్లల వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తాయి. తల్లిదండ్రులు చాలామంది

ఇలా చేయొచ్చు .. తల్లిదండ్రులు

- **బాలలు బాల్యాన్ని పరిపూర్ణంగా అనుభవించటానికి పెద్దలే పూనుకోవాలి. పిల్లల మానసిక, శారీరక వికాసానికి ఈదశ బాగా దోహదపడతుందని గుర్తించాలి. దేనిలో శిక్షణ ఇప్పించినా దాన్లో అందరికన్నా ముందుండాలి అని పదే పదే చెప్పకూడదు. నైపుణ్యం, ప్రతిభ వంటి ఉమ్మడితనంలోంచి ప్రోత్సహించాలి.**
- **మీ ఇంటి చుట్టుపక్కల ఉన్న పిల్లలను కలిసి ఆడుకునేలా ఉత్సాహపరచండి. ఒకరికి ఒకరు సహాయపడే ఆటల్లాంటివి పరిచయం చేయాలి. దగ్గరగా పర్యవేక్షిస్తూనే పిల్లలను స్వేచ్ఛగా ఆడనివ్వాలి.**
- **విశాలమైన ఆటస్థలం ఉన్న స్కూళ్లలోనే పిల్లలను చేర్చాలి. మీ పిల్లలు చదువుతున్న స్కూలుకు ఆటస్థలం ఉందా? ఉంటే దానిని ఆటలకు ఉపయోగిస్తున్నారా? పరిశీలించండి.**
- **స్కూలుకు వెళ్లినప్పుడు మార్కులు వగైరా విషయాలతో పాటు ఆటపాటల్లో పిల్లలు ఎలా ఉన్నారో తెలుసుకోవాలి.**
- **నివాస ప్రాంతాల్లో చిల్డ్రన్స్ క్లబ్బులు పెట్టాలి. ఆటలు, పాటలు, సృజనాత్మక పోటీలు; శిక్షణ వంటివి చేపట్టాలి.**
- **ఎక్కువ మార్కులు, మంచి ర్యాంకులు తెచ్చుకోవాలని పిల్లలను ప్రోత్సహించవచ్చు. కానీ, తెచ్చుకొని తీరాలి అని ఒత్తిడి చేయకూడదు.**

ఈ విషయాన్ని అంగీకరిస్తారు. అనేక చర్చలూ, సమాలోచనలు, ఉద్యమాల తరువాత ప్రైవేటు పాఠశాలల్లో కూడా విద్యేతర అంశాలు చేర్చారు. అయితే, ఇవి చాలాచోట్ల నామమాత్రంగా ఉన్నాయి. నృత్యం, సంగీతం, కరాటే, స్కేటింగ్, స్విమ్మింగ్, పెయింటింగ్ వంటివి స్కూళ్లలో ప్రకటించినప్పటికీ – ఇందులో చాలా వాటికి శిక్షకులు ఉండరు. ఉన్నా విద్యార్థులు వీటిలో ఒకటి, లేదా రెండు అంశాలకే పరిమితం కావాలి. ఎక్కువ ఇష్టపడటానికి, నేర్చుకోవటానికి అవకాశం లేదు. అంటే పిల్లవాడి ఆసక్తి లేదా అభిరుచి పరిధిని కుదించుకోవాలి.

ఇలాంటి విద్యేతర అంశాల్లో తమ పిల్లలు చదువుకు ఆటంకం లేకుండా పాల్గొనాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. స్కేటింగ్, స్మిమ్మింగ్, కరాటే, సంగీతం వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. సమ్మర్ క్యాంపులకు పంపిస్తున్నారు. ఒకప్పుడు వీధుల్లో, విశాల మైదానంలో సహజంగా నేర్చుకునే అంశాలు ఇప్పుడు ప్రత్యేక శిక్షణగా మారాయి. అందమైన ఎక్వేరియంలో బంగారు చేప ఈదులాడినట్టే – పరిమిత పరిధిలో పిల్లలు బాల్యాన్ని ఆహ్లాదిస్తున్నారు.

అన్నింట్లో పోటాపోటీ

స్పర్థయా వర్థతే విద్యా అన్నారు. అయితే, ఆ స్పర్థ, పోటీ ఆరోగ్యకరంగా ఉండాలి. ఏ ఆటలో అయినా ఒక్కరు లేదా ఒక బృంద సభ్యులు గెలుస్తారు. మిగిలినవారు పరాజితులవుతారు. గెలుపు లేదా ఓటమి ఒక అనివార్య పరిణామం. ఆట మొత్తం అదే కాదు.. ఆడడం ద్వారా పొందే ఆనందం అందరిదీ! ఆట పరమార్థం ఇదే!

కానీ, ఆటను ఆటలా, ఒక ఉమ్మడి సరదాలా చూసే వైఖరి క్రమేణా మారుతోంది. మనమే విజేత కావాలి.. అన్న ధోరణి పట్టుదలకు ప్రతీక. అంతమాత్రాన మనం ఓటమిని స్వీకరించలేని స్థితి ఉండకూడదు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏమి నేర్పించినా అది వారి

వికాసానికి ఉపయోగపడాలి. టీవీల్లోనో, వేదికల మీదనో అందరికన్నా ముందు నిలవాలి అన్న తాపత్రయం పెంచకూడదు. నేనే గెలవాలి అన్న తపన, గెలుపోటముల పట్ల తీవ్ర భావోద్వేగాలు ఇప్పుడొక ధోరణిగా బలపడ్డాయి. ఆ తత్వం సహజానందాన్ని, సంతోషాన్ని హరించివేస్తుంది. ఇది కూడా బాల్యానికి చేటు తెస్తుంది.

కంప్యూటర్లో, సెల్‌ఫోన్లలో గేమ్స్‌కు పిల్లలు అతుక్కుపోతున్నాయి. గంటల తరబడి ఆడుతున్నారు. కారు రేసింగ్ వంటి ఆటలు పిల్లల్లో విపరీత ధోరణిని ప్రేరేపిస్తాయి. ఒంటరితనాన్ని ఇష్టపడేలా చేస్తాయి. ఇవన్నీ కూడా బాల్యాన్ని బలి పెట్టే వ్యాపకాలే! పిల్లలకు బాల్యం బాల్యంగా దక్కాలి. అది వారి హక్కు. కానీ, ఇప్పటికే ఉన్న విద్యాచట్రం అందుకు అనుగుణంగా లేదు. ఆ చదువుల చక్రం పిల్లలను ర్యాంకులు, మార్కుల వైపే తిప్పుతుంది. ఈలోగా బాల్యం నెమ్మదిగా జారిపోతుంది. అలా జారకుండా బాలలూ, బాల్యమూ కలిసికట్టుగా జట్టు కట్టి సాగాలి! చదువుల పరుగును పట్టుపట్టి ఆపి, శాస్త్రీయ మార్గంలో ప్రవేశపెడితే తప్ప – ఆ పని సాధ్యం కాదు!

ఓ విద్యార్థి దినచర్య

నా పేరు ప్రశాంత్.. ఒక కార్పొరేట్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాను. ఉదయం 6.15 గంటలకు నిద్ర లేస్తాను. రెడీ అయ్యి, 6.45 గంటలకల్లా స్కూలికి వెడతాను. 7 గంటలకు క్లాసులు మొదలవుతాయి. బాగా నిద్ర వచ్చేస్తూ ఉంటుంది. కొన్ని పాఠాలు అర్థం కావు. లంచ్ అవర్లో ఫ్రెండ్సుని అడిగి తెలుసుకుంటాను. సాయంత్రం 4.30 గంటలవరకూ రెగ్యులర్ క్లాసులు ఉంటాయి. 5 గంటల నుంచి 7 గంటల వరకూ స్పెషలు క్లాసులు జరుపుతారు. ఇంటికి వెళ్లేసరికి 7.30 అవుతుంది. తిని, హోంవర్కు మొదలెడతాను. 9.30 - 10 గంటలవరకూ ఆ పని ఉంటుంది. 11 వరకూ చదువుతాను. ఆటలకు అసలు టైం ఉండదు. ఆదివారం కూడా చాలా స్పెషలు వర్కు ఉంటుంది.

కరాటే నేర్చుకోవాలని చేరాను. కానీ, కుదరటం లేదు. మా ఫ్రెండ్సు అందరి టైం షెడ్యూలు దాదాపుగా ఇలాగే ఉంటుంది. 9, 10 క్లాసులకు అయితే- ఈ షెడ్యూలు మరింత బిజీగా ఉంటుంది. ఆడుకోవాలని ఉంటుంది. కానీ, అవదు. టెన్తులో 9.6 పాయింట్లు కన్నా ఎక్కువ తెచ్చుకోవాలని నా లక్ష్యం. ఎందుకంటే మా అన్నయ్యకు 9.6 పాయింట్లు వచ్చాయి. నేను అంతకన్నా ఎక్కువ తెచ్చుకోవాలి కదా మరి! అందుకనే - ఆటలు లేకపోయినా కష్టపడి చదవాలి.

నాకు మెరైన్ ఇంజనీరింగ్ ఇష్టం. ఎంసెట్లో మంచి ర్యాంకు తెచ్చుకొని- మంచి కాలేజీలో సీటు సంపాదిస్తాను.

- జి.వి.ఆర్. ప్రశాంత్, విశాఖపట్నం.

ఊరించే ఉప్మా

మొక్కజొన్నతో...

కావలసినవి : ఉడికించిన మొక్కజొన్న గింజలు : 1/4 కప్పు, బఠాణీ గింజలు: 1/4 కప్పు, మొక్కజొన్న రవ్వ : 1/2 కప్పు, సన్నగా తరిగిన ఉల్లి తరుగు : 1 పెద్ద స్పూను, సన్నగా తరిగిన అల్లం : 1 చిన్న స్పూను, పచ్చిమిర్చి తరుగు : 1/2 చిన్న స్పూను, నిమ్మరసం : 1 పెద్ద స్పూను, ఆవాలు : 1 చిన్న స్పూను, ఉప్పు : రుచికి తగినంత, గరంమసాలా : 1/2 చిన్న స్పూను, రిఫైండ్ ఆయిల్ : 1 పెద్ద స్పూను, నీళ్లు : 1 కప్పు.

తయారీ విధానం : ప్రెషర్ కుక్కర్‌లో రిఫైండ్ ఆయిల్ వేడి చేసి ఆవాలు, అల్లం, పచ్చి మిర్చి, ఉల్లిపాయలు వేసి 2 నిముషాలు పాటు వేయించాలి. మొక్కజొన్న రవ్వ, ఉడికించిన మొక్కజొన్న గింజలు, బఠాణీలు వేసి కలిపి కొద్దిగా వేయించాలి. ఉప్పు, నిమ్మ రసం కలిపి 1 కప్పు నీళ్లు పోసి కుక్కర్ మూత పెట్టాలి. ఒక్క విజిల్ రాగానే కుక్కర్ స్టవ్ మీద నుండి దింపెయ్యాలి. ప్రెషర్ తగ్గిన తర్వాత మూత తీసి గరంమసాలా చల్లితే రెడీ అయినట్లే. ఈ మొక్కజొన్న ఉప్మాని వేడి వేడిగా వడ్డించాలి.

మసాలా పాపడ్



కావలసినవి : వేయించిన అప్పడాలు : ఆరు, ఉల్లిపాయలు, టమాటాలు : రెండు చొప్పున, కొత్తిమీర తురుము : చెంచా, వేయించిన జీలకర్ర పొడి : పావు చెంచా, ఉప్పు, కారం : అరచెంచా చొప్పున, పనీర్ తురుము : రెండు చెంచాలు.

తయారీ విధానం : ఉల్లిపాయ, టమాటాలను సన్నగా తరిగి పెట్టుకోవాలి. అప్పడాలను ఓ పళ్లెంలో అమర్చాలి. వాటిపై తరగిన ఉల్లిపాయ, టమాటా ముక్కలు పలుచగా పరవాలి. ఉప్పు, కారం, జీలకర్ర పొడి విడిగా కలిపి.. వీటిపై చల్లాలి. చివరగా పైన పనీర్, కొత్తిమీర తురుము చల్లితే కమ్మని మసాలా పాపడ్ సిద్ధం.

కోడిగుడ్డుతో కమ్మగా...

కావలసినవి : గుడ్లు : రెండు, సెనగపిండి : రెండు కప్పులు, మొక్కజొన్న పిండి : రెండు చెంచాలు, ఉప్పు, కారం, గరంమసాలా : చెంచా చొప్పున పచ్చిమిర్చి: మూడు, వెల్లుల్లి : పది రేకలు, తోటకూర : కట్ట, అల్లం : కొద్దిగా, వరిపిండి: రెండు కప్పులు, ఉల్లిపాయలు : రెండు.

తయారీవిధానం : ముందుగా గుడ్లని కొట్టి సొనని బాగా కలపాలి. అందులో ఉప్పు, కారం వేసి కలపాలి. తర్వాత సెనగపిండి, వరిపిండి, గుడ్లసొనలో కలపాలి. మొక్కజొన్న పిండినీ దానిలో వేసి కలియతిప్పాలి. పచ్చిమిర్చి, అల్లంవెల్లులి, తోటకూర, ఉల్లిపాయలను సన్నగా తరిగి కలపాలి. ఇప్పుడా మిశ్రమాన్ని చేత్తో అద్ది వడలుగా వేసి వేయించుకోవాలి. ఇందులో వెల్లుల్లి రేకలను పొట్టు తీసి అలానే వేసుకుంటే రుచిగా ఉంటాయి.



చపాతీలు

కావలసినవి : చపాతీలు : మూడు, పనీర్ తురుము : మూడు చెంచాలు, ఉల్లిపాయ ముక్కలు : పావుకప్పు, పచ్చిమిర్చి : రెండు, టమాటాలు: రెండు, క్యాప్సికం ముక్కలు : రెండు చెంచాలు, నూనె : పావుకప్పు, అల్లంవెల్లుల్లి : అరచెంచా, కారం: కొద్దిగా, ఉప్పు : రుచికి సరిపడా, పసుపు : చిటికెడు, కొత్తిమీర తరుగు : రెండు చెంచాలు, కరివేపాకు : రెండు రెబ్బలు.

తయారీ విధానం : బాణలిలో రెండు చెంచాల నూనె వేడిచేసి ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, పనీర్ తురుము, క్యాప్సికం ముక్కలు వేయించాలి. రెండు నిమిషాలయ్యాక టమాటా ముక్కలు, అల్లంవెల్లుల్లి మిశ్రమం, పసుపు, సరిపడా ఉప్పు, కారం, కరివేపాకు చేర్చి వేయించి ముక్కల్ని మగ్గనివ్వాలి. చివరగా కొత్తిమీర వేసి దింపేస్తే సరిపోతుంది. ఈ కూరను చపాతీల్లో ఉంచి గుండ్రంగా చుట్టేయాలి. ఇలా చేసుకున్న వాటిని పెనంపై ఉంచి మరో చెంచా చొప్పున నూనె వేసి రెండువైపులా కాల్చుకోవాలి. ఇంకా రుచికరంగా ఉండాలనుకుంటే... మైదా, మొక్కజొన్న పిండిలో ముంచి కాగుతోన్న నూనెలో వేయించుకోవచ్చు.

గోబీ పరాటా

కావలసినవి : గోధుమపిండి : 4 కప్పులు, కాలీఫ్లవర్ తురుము : 2 కప్పులు, కొత్తిమీర తురుము : 2 టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి : రెండు, అల్లం : అంగుళం ముక్క, ఉప్పు, కారం, గరంమసాలా : రుచికి సరిపడా, వాము : అర టీ స్పూను, నూనె లేదా వెన్న: కాల్చడానికి సరిపడా.

తయారీ విధానం : గోధుమపిండిలో ఉప్పు, సరిపడా నీళ్లు పోసి చపాతీ పిండిలానే కలపాలి. కాలీఫ్లవర్ తురుమును వేడినీళ్లలో వేసి తీయాలి. కాలీఫ్లవర్ తురుము, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, కొత్తిమీర తురుము, వాము, కారం, ఉప్పు, గరంమసాలా అన్నీ కలపాలి. పిండిని ముద్దలుగా చేసుకోవాలి. ముందుగా రెండు చపాతీల్ని మీడియం సైజులో చేసుకోవాలి. ఒక చపాతీ మీద కాలీఫ్లవర్ ముక్కల మిశ్రమాన్ని సర్ది దానిమీద మరో చపాతీని పెట్టి మళ్లీ కర్రతో ఒకే చపాతీలా చేయాలి. ఇలాగే అన్నీ చేసుకుని నూనె లేదా వెన్నతో రెండువైపులా కాల్చి తీయాలి.

సంప్రదాయ చదువుల సరిహద్దులు దాటేద్దాం!

'నిరక్షరాస్యత మన దేశానికి ఉన్న అతి పెద్ద కళంకం. దానిని విధిగా నిర్మూలించాలి' అన్న గాంధీ మాటలు ఇంకా దేశమంతా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. 1990వ సంవత్సరాన్ని అంతర్జాతీయ అక్షరాస్యతా సంవత్సరంగా ప్రకటించింది ప్రభుత్వం. 21వ శతాబ్దంలోకి భారతదేశం సంపూర్ణ అక్షరాస్యతతో అడుగు పెట్టాలనే నేటి పాలకుల మాటలు కోటలు దాటాయి. ఆచరణలో అడుగు ముందుకేయలేదు. 68 సంవత్సరాలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే...ఇటీవల విద్యాశాఖ కేంద్రస్థాయి వాస్తవాలు దిమ్మెరపరిచాయి. ఉన్నత పాఠశాల స్థాయికి వచ్చిన విద్యార్థులలో 45 శాతం తెలుగు రాయలేకపోతున్నారు. సరిగ్గా చదవలేకపోతున్నారు. ప్రతి నలుగురు స్త్రీలలో ముగ్గురు నిరక్షరాస్యులు. ప్రపంచ అక్షరజ్ఞానం లేని మహిళల్లో సగానికి పైగా భారతీయులే. ఐరాస సంస్థ యునెస్కో నిర్వచనాన్ని(మాతృభాషలో చదివి అర్థంచేసుకోగలిగి రాసే సామర్థ్యం ఉన్నవాడే అక్షరాస్యుడు) అన్వయిస్తే దేశంలో ఎంత శాతం అక్షరాస్యులుగా ఉంటారు అనే విషయం ఊహించుకోవటానికే భయమేస్తుంది. ఇప్పటికీ దేశంలో కోట్లాది మంది నిరక్షరాస్యులు, ప్రభుత్వ పాఠశాలలో చదువు పేరుకే అన్నట్లయి అక్షర జ్ఞానాన్ని అందుకోలేని అభాగ్యులు మరెందరో. దీనంతటికీ కారణం అక్షరాస్యతా సమస్యను ఒక సవాల్‌గా తీసుకోకపోవడమే. వాచకాల భాష, వాటి బోధన అభ్యాసకులు జీర్ణం చేసుకునేదిగా ఉండక పోవడం, ఒక తంతుగా చేస్తున్న భాషా బోధనలో ఆధిపత్య ధోరణి తప్ప ప్రేమతో అందించే మనసు లేకపోవడం అనేవి విద్యా బోధనలో నిత్యం కనపడేవే. ఏళ్ల తరబడి పేరుకున్న నిర్లక్ష్యం ఒక్క ఉదుటున కొట్టుకపోదు, ఉన్నట్టుండి పద్ధతులు మారిపోవు. అయినా ప్రజల హితం కోరేవారు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను చేయక మానరు. అలా స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు చేసిన ప్రత్యామ్నాయ ప్రతిపాదనను పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ ప్రతిపాదనను నెల్లూరు నరసింహారావు మరింతగా పదునుపెట్టి తెలుగు నేర్పటానికి ఒక నూతన పద్ధతిని రూపొందించారు. అ పద్ధతే ఎన్.ఆర్. పద్ధతి. ఆ పద్ధతిని తెలుగు వాచకం (వారంలో తెలుగు)గా 'ప్రజాశక్తి బుక్ హౌస్' ప్రచురించటం జరిగింది. నిజానికి ఈ ప్రచురణ మొదటిసారి జరిగింది కాదు. ఖమ్మం జిల్లాలో అనేక గ్రామీణ పాఠశాలల్లోను, వయోజన విద్యా కేంద్రాలలోను, ఆదిలాబాద్ జిల్లాలోని సింగరేణి కార్మికులకు, అక్కడి పాఠశాలలో ఈ పద్ధతిని ఆచరించి తెలుగును బోధించారు. అతి తక్కువ సమయంలో తెలుగును నేర్పగల శక్తి ఈ పద్ధతి సొంతం. ఆచరించి చూస్తే మొదటి రోజే ఈ పద్ధతి ప్రయోజనం తెలుస్తుంది.



ఎన్ఆర్ పద్ధతి తెలుగు వాచకం (వారంలో తెలుగు), రచన: నెల్లూరు నరసింహారావు, పేజీలు: 190, ధర: 200రు, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, 27-1-54, ఏలూరు రోడ్, గవర్నర్ పేట, విజయవాడ-2. ఫోన్: 0866-577533.

అసలు ఎన్ ఆర్ పద్ధతి అంటే ఏమిటి? భారతీయ భాషలు నేర్వటానికి దాదాపు 500 అక్షరాలను గుర్తుపట్టగలగాలి. అలా గుర్తుపట్టగలిగితేనే ఎవరైనా చదవగలుగుతారు. అయితే అది అంత సులభం కాదు. క్రిష్టఫర్ కాడ్వెల్ రాసిన 'ఇల్యూజన్ అండ్ రియాలిటి' గ్రంథంలో లయ ప్రాధాన్యతను వివరించారు. ఇతర ప్రయోజనాలతో పాటు లయతో జ్ఞాపక శక్తి అపారంగా పెరుగుతుందని సూత్రీకరించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ తన 'గీతాంజలి'లో 'ఈ మనోజ్ఞ లయకు పరవశించని హృదయమానీది?' అని ప్రశ్నిస్తాడు. అలానే ప్రముఖ బ్రెజిలియన్ తత్వవేత్త పాలో ఫ్రెయిరీ తన 'పెడగాగీ ఆఫ్ ద అప్రెస్డ్' గ్రంథంలో విమర్శనాత్మక బోధనా పద్ధతిని రూపొందించి ప్రజల భాషలో ప్రజలకు ఎలా బోధించాలో చెప్పాడు. అంటే ప్రజలు నిత్యం మాట్లాడుకునే భాషలోనే చదువ నేర్పిస్తే వేగంగా నేర్చుకోగలుగుతారు. ఇది జరగాలంటే భాషాధ్యయనంలో ముఖ్యంగా రెండు మార్పులు జరగాలి. మొదటిది లయను జనింపజేసే విధంగా అక్షర క్రమం, వీలున్నంత వరకూ పద క్రమం ఉండాలి. రెండవది, భాషాధ్యయనంలో అభ్యాసకులు తమ స్వంత భాషను ఉపయోగించే ఏర్పాటు ఉండాలి. అంటే అభ్యాసకులది ఏ యాసైనా లేక ఏ మాండలీకమైనా అదే యాసలో లేక అదే మాండలీకంలో వారు తెలుగు నేర్చుకోగలగాలి. ఈ సౌకర్యాన్ని ఏ వాచకమూ అందించ లేదు ఒక్క 'ఎన్ ఆర్ పద్ధతి' తప్ప. అదేలా? అభ్యాసకుల మనసుపై చెరగని ముద్రను వేయగల, వారి జ్ఞాపక శక్తిని బ్రహ్మాండంగా పెంచగల శక్తిని కలిగియున్న లయను సప్తస్వరాలైన 'సరిగమ పదని'ల ద్వారానూ, పరుష, సరళాక్షరాలతోనూ జనింపజేయవచ్చు అని నిరూపించటం జరిగింది. అంటే అక్షరాలను ఈ విధంగా క్రమం మార్చి రాయటం జరిగింది: స ర గ మ / ప ద న / వ ల య / క చ ట త ప / గ జ డ ద బ / స శ ష / న ణ. ఇక మిగిలినవి హ క్ష లు మాత్రమే. అలాగే అభ్యాసకులు తాము మాట్లాడే భాషలోనే అభ్యసించటానికి అవకాశమిచ్చే బోధనా పద్ధతిని రూపొందించారు (ఈ బోధనా పద్ధతి ఆచరణలో ఎలా ఉంటుందో చూడటానికి ఈ లింకు https://soundcloud.com/narasimha-rao-nellore/01-vaaramlo-chadhuuvu1 ను కాపీ చేసి ఇంటర్ నెట్ బ్రౌజర్‌లో పేస్ట్ చేస్తే మీరు వినగలుగుతారు). తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో భారతీయ భాషలను ముఖ్యంగా తెలుగును నేర్పించగలిగే పద్ధతిని రూపొందించటం బహుశా ఇదే మొదటిసారి అని నేను భావిస్తున్నాను. గతంలో చాలా మంది ప్రముఖులు అనేక వాచకాలను రాశారు. అయితే ఇంతకుముందు ఎవ్వరూ ఫలానా కారణం చేత ఫలానా విధంగా చేస్తే తెలుగును వేగంగా నేర్చుకోగలుగుతారని సూత్రీకరించి ఆచరణలో పెట్టలేకపోయారు. 'ఎన్ ఆర్ పద్ధతి'కి జీవితాలను మార్చగలిగే (లైఫ్ ట్రాన్స్‌ఫార్మింగ్) శక్తి ఉన్నదని వాస్తవంలో ఋజువయింది. ఇది ఆచరణకు వీలుకాని మరో సిద్ధాంతం కాదు. అభ్యసన ప్రక్రియలో దీని ప్రభావం ప్రతి గంట గంటకూ తెలుస్తుంది. ఒక్క రోజు ఈ పద్ధతిలో బోధించినా ఇది నిజమా కాదా అనేది తెలుస్తుంది. ముందుగా కావలసింది నిరక్షరాస్యతను అధిగమించాలనే సంకల్పం. ఆ తరువాత చేయవలసిందల్లా ఒక వారం, పది రోజులు కష్టపడటం. అంతే తెలుగు చదవటం వచ్చేస్తుంది!

- భూపతి వెంకటేశ్వర్లు

విలువైన పుస్తకం

'ఉక్కుపాదం' నవల కవితాత్మకంగా సాగుతుంది. అలాగని పాఠకులను వారి చుట్టూ ఉన్న సమాజం నుంచి, సమస్యల నుంచి దూరంగా, ఊహా లోకాల్లోకి తీసుకుపోయే రచన కాదు. నేటి వ్యవస్థలోని పరస్పర విరుద్ధమైన రెండు వర్గాలను, వారి ప్రయోజనాలను, తమను తాము కాపాడుకోవడానికి వారు చేసే ప్రయత్నాలను, అమానుషమైన యుద్ధకాండను, మారణ హోమాన్ని మన కళ్ల ముందు నిలబెడుతుంది. 1917లో లెనిన్ నాయకత్వాన రష్యన్ విప్లవం జయప్రదం కావడం అందరికీ తెలుసు. అయితే అంతకు ముందు 1905లో అక్కడ జరిగిన తిరుగుబాటు, దాని వైఫల్యానికి కారణాలు కొందరికే తెలుసు. ఆ అనుభవాల సారాంశంగాను, భవిష్యత్తు శ్రమజీవులదే అన్న దృఢ విశ్వాసంతోను జాక్ లండన్ ఈ పుస్తకాన్ని రచించాడు. దోపిడీ వర్గం పార్లమెంటును, చట్టాలను ఎట్లా నామమాత్రం చేస్తుందో, తమ ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుందని అనుకున్నప్పుడు తాను నిరంతరం వల్లించే 'శాంతి' వంటి ధర్మపన్నాలను తుంగలో తొక్కి ప్రజలపై క్రూర హింసాకాండకు ఎట్లా తెగిస్తుందో, దుర్భేద్యమైన శత్రువుల కోటల్లోకి కూడా మనం ఎలా ప్రవేశించాలో ఇందులో అద్భుతంగా వర్ణితమైంది.

దీనిలోని నాయకుడు ఎర్నెస్ట్ ఎవర్‌హర్డ్ దోపిడీ వర్గాల అజ్ఞానాన్ని, అహంకారాన్ని తన అద్భుతమైన వాదనా పటిమతో, గణాంకాల, ఘటనల వివరాలతో తుత్తునియలు చేస్తాడు. మధ్యతరగతి వర్గం త్రిశంకు స్వర్గంలో చాలాకాలం ఉండజాలదని, అట్టడుగు వారితోనే వారి భవిష్యత్తు ముడి పడి ఉందని వారికి హితబోధ చేస్తాడు. ఎర్నెస్ట్ చేసే నిరంతర అధ్యయనం, వాదనా పటిమ, అవలంబించే ఎత్తుగడలు, శ్రమజీవులకు నాయకత్వం వహించే కార్యకర్తలకు మార్గదర్శకాలుగా, పాఠాలుగా ఉపయోగపడతాయి. వారు ఆయనను ఒక ఆదర్శం/ నమూనా (రోల్ మోడల్)గా పెట్టుకుని పురోగమించడానికి తోడ్పడతాయి.

సంపన్న కుటుంబంలో పుట్టినా ఎర్నెస్ట్‌ను ఏరికోరి వివాహం చేసుకున్న ఎవిస్ ప్రాణాలకు తెగించి తన విప్లవ కార్యక్రమాలను నిర్వహించి ఎర్నెస్ట్‌కు సరియైన జోడీగా నిలబడుతుంది. తన వర్గపు భ్రమల నుంచి బయటపడి అధోజగత్ సహోదరుల కోసం పనిచేస్తుంది. విశ్వవిద్యాలయంలో ఆచార్యుడు, గొప్ప శాస్త్రజ్ఞుడు అయిన తన తండ్రికి వాటాలు ఉన్న ఒక కర్మాగారంలో ఒక కార్మికుడికి అన్యాయం జరిగిందని తెలుసుకొని దానిని నిర్ధారించుకోవడానికి ఆమె చేసిన ప్రయత్నంలో, బిషప్ మూర్‌హౌస్‌కు తోడ్పడడంలో ఆమె మానవతా దృష్టే కాదు, కార్మికవర్గ ప్రయోజనాల పట్ల ఆమె నిబద్ధమైన తీరు కూడా కనబడుతుంది. ఈ నవలలోని నాయికా నాయకులు రచయిత జాక్‌లండన్‌కు, ఆయన భార్యకు ప్రతిరూపాలే అనడం వాస్తవికతకు అద్దం పట్టడమే. చికాగోను గురించిన ఉపాఖ్యానం, ఎర్నెస్ట్– ఎవిస్‌ల సంభాషణలలోని హాస్యం, వారి మధ్యగల అనుబంధం, ఆత్మీయత పాఠకులను కట్టిపడేస్తాయి.

1907లో కాపీ రైట్‌ను పొంది 1908లో వెలువడిన ఈ నవలలో 1912, 1913, 1915, 1917, 1918, 1932 సంవత్సరాలలో జరిగిన ఘటనల ప్రస్తావన రావడం పాఠకులలో ఆశ్చర్యాన్ని, గందరగోళాన్ని కలిగిస్తుంది. వాస్తవం ఏమిటంటే 'రవి గాంచనిచో కవి గాంచును' అన్నట్లు గత ఘటనల పట్ల, ఘర్షణల పట్ల సరైన అంచనా, భవిష్యత్తు గురించి స్పష్టమైన అవగాహన, కార్యాచరణ ప్రణాళిక, కార్మికవర్గ సిద్ధాంత నిబద్ధత కలిగిన రచయిత ఊహల, అంచనాల సమాహారామే ఈ నవల. ఈ నవల వెలువడి శతాబ్దం గడిచినా దీనిలోని ఘటనలు, వాద ప్రతివాదాలు, నేడు మన దేశంలోను, ఇతర దేశాలలోను జరుగుతున్న ఘటనలతో పోలి ఉండడం యాదృచ్ఛికం కాదు. మార్క్సిస్టు సిద్ధాంతం, దానిలోని గతితర్కం, ఆ దృక్పథంతో ఆనాడు వేసిన అంచనాలు నేడు కూడా ఎంత వాస్తవంగా ఉన్నాయో చూస్తే సిద్ధాంతపు విశిష్టత మనకు అర్థం అవుతుంది.

ఉక్కుపాదం,
రచన- జాక్ లండన్, వెల: 125/-,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్,
27-1-54, ఏలూరు రోడ్, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఫోన్: 0866-577533.

ఈ నవలలో చికాగో, న్యూయార్క్ నగరాల ప్రస్తావన, వర్ణన యథాలాపంగా కాక అర్థవంతంగానే జరిగింది. కార్మికోద్యమ చరిత్రలో అతి ముఖ్యమైన 'మేడే' ఘటనలు జరిగింది చికాగోలో కాగా అమెరికా సామ్రాజ్యవాదుల కీలక కేంద్రంగా న్యూయార్క్ ఉండి – ఈ రెండు నగరాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

అందరూ, ముఖ్యంగా కార్మిక, కర్షక వర్గ ప్రయోజనాల కోసం పని చేస్తున్న మేధావులు, కార్యకర్తలు నిశితంగా, పదేపదే చదవాల్సిన, రోజువారీ జీవితంలో విప్లవ కార్యకలాపాల్లో ఉపయోగించుకోదగిన గొప్ప విలువైన పుస్తకం ఇది.

- నరహరి

స్వీకారాలు

MODI GOVERNMENT
NEW SURGE OF COMMUNALISM

SITARAM YECHURY
PRICE : RS : 125
PAGES : 184,
FOR COPIES: PRAJASAKTI BOOK HOUSE (TG)
M.H BHAVAN, PLOT NO:21\1
AZAMABAD, NEAR RTC KALYANA MANTAPAM
HYDERABAD : 500020
PH: 040-27660013



సంక్షోభంలో సంపదల పెరుగుదల

2008లో ప్రారంభమైన ధనిక దేశాల సంక్షోభం తెచ్చిన నష్టం ఎంత అన్నదానిపై వివిధ అంచనాలు ఉన్నాయి. మొత్తం మీద లక్షల కోట్ల నష్టం గురించి అందరూ అంగీకరిస్తున్నారు. అయితే ఈ నష్టాన్ని ఎవరు భరించారన్నదే అసలు పాయింటు. ఈ సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి ప్రపంచంలో బిలియనీర్లు రెట్టింపు అయ్యారని ఆక్స్‌ఫామ్ సంస్థ తాజా నివేదికలో వెల్లడించింది. అంటే ధనికులు మరింత ధనికులుగా దరిద్రులు నిష్టదరిద్రులుగా మారారన్నది స్పష్టం. డబ్బు చేతులు మారుతుంది తప్ప అది నాశనం కాదు. ఆర్థిక సంక్షోభం ప్రారంభమైన తరువాత 2009 నుంచి ఇప్పటికి బిలియనీర్ (వంద కోట్ల డాలర్లు, లేదా ఆరు వేల కోట్ల రూపాయలకుపైన)లు 793 నుంచి 1,645కు పెరిగారట. ఇక దారిద్ర్య ప్రభావం ఎలా ఉందంటే ఇదే కాలంలో కనీస వైద్య వసతులు లేక ప్రసవ సమయంలో పదిలక్షల మంది మరణించారని, 5.7కోట్ల మంది పిల్లలు ఎలాంటి విద్యకు నోచుకోలేకపోయారని బ్యాంక్ ఆఫ్

“ తాజా సమాచారం ప్రకారం జపాన్‌లోని టోకియో నగరంలో ఉన్న బిలియనీర్ల కంటే మన ముంబయ్‌లో ఎక్కువ మంది ఉన్నట్లు, ఆసియాలో నాలుగవ ధనిక నగరంగా పెరిగినట్లు వెల్లడైంది. ప్రపంచంలోని 2,325 మంది బిలియనీర్ల ఆస్థుల మొత్తం 7.3లక్షల కోట్ల డాలర్లు. గతేడాదితో పోల్చితే ఈ ఏడు ఏడుశాతం బిలియనీర్లు అభివృద్ధి చెందితే వారి ఆస్తులు 12శాతం పెరిగాయని వెల్త్-ఎక్స్ అనే సంస్థ పేర్కొన్నది. ”

ఇంగ్లండ్ ప్రధాన ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి పొందిన ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిజ్ పేర్కొన్నారు. ప్రపంచంలోని 85 మంది అగ్రశ్రేణి ధనికుల సంపద మొత్తం ప్రపంచంలోని 350 కోట్ల మంది పేదల సంపదకు సమానం.పైన పేర్కొన్న ధనవంతుల సంపద గతేడాది రోజుకు 65.8 కోట్ల డాలర్ల వంతున పెరిగింది. ఆఫ్రికాలోని సబ్ సహారా ప్రాంతంలో 16 మంది బిలియనీర్లు వుండగా 35.8 కోట్ల మంది దుర్భర దారిద్ర్యంలో ఉన్నారు. అయితే బిలియనీర్ల సంఖ్య గురించి కూడా ఏకీభావం లేదు. మరొక సమాచారం ప్రకారం వారి సంఖ్య 2,325.

ఓయిసిడి సంస్థ గత నెలలో ప్రకటించిన ఒక నివేదిక ప్రకారం 1820 నుంచి తీవ్ర అసమానతలు ఇప్పుడు ఆందోళనకర స్థాయికి పెరిగాయి. న్యాయబద్ధమైన సమాజాన్ని సృష్టించటం నైతిక బాధ్యత అని బ్యాంకర్లు గుర్తించకపోతే పెట్టుబడిదారీ విధానం తనను తానే నాశనం చేసుకుంటున్నట్లుగా భావించాలని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్ మే నెలలో వ్యాఖ్యానించాడు. ప్రతి నిమిషానికి ఐదు లక్షల డాలర్లు పొందుతున్నారు. ఇక ప్రపంచ ధనికుడు తన సంపదను ఇష్టమొచ్చిన రీతిలో ఖర్చు చేయాలంటే 220 సంవత్సరాలు పడుతుందట.

ఇక ఇలాంటి ధనవంతులు తమ సంపదలను ఎలా ఖర్చు చేస్తున్నారు? ఈనెల నాలుగున అమెరికాలో అత్యంత ఖరీదైన పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. వాటిలో వీరంతా సొమ్మును మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు చేశారు. అటు డెమోక్రటిక్ ఇటు రిపబ్లికన్ పార్టీల వెనుక చేరి ఎన్నికలను పూర్తిగా కొనుగోలు చేశారని చెప్పవచ్చు. లెక్కల్లో చూపిన మొత్తాలకు కొన్ని రెట్లు బ్లాక్‌మనీ ఖర్చు చేశారని వేరే చెప్పనవసరం లేదు. ఫేస్‌బుక్ స్థాపక అధ్యక్షుడు పార్కర్ 2012 ఎన్నికలలో అధికార యుతంగా చేసిన ఖర్చు కంటే తాజా ఎన్నికలలో 16 రెట్లు ఎక్కువ పెట్టారు. గత ఎన్నికలలో డెమోక్రాట్లకే తన ఖర్చును పరిమితం చేస్తే ఈ సారి కేవలం ఐదుశాతం డెమోక్రాట్లకు మూడోవంతు రిపబ్లికన్లకు కేటాయించాడట. కొంత మంది తాము పార్టీలను చూసిగాక వ్యక్తులను చూసి విరాళాలు ఇస్తున్నట్లు చెప్పుకున్నారు. మరికొందరు పార్టీల కంటే లాభాపేక్షలేని సంస్థలకు తాము విరాళాలు ఇచ్చినట్లు చెప్పుకున్నారు. నిజానికి అలాంటి సంస్థలు విరాళాల సొమ్మును పార్టీల ఖాతాలో పడకుండా చూసేందుకు పార్టీల మద్దతుదార్లతో ఏర్పాటు చేసినవే ఎక్కువగా ఉంటాయి.

తాజా సమాచారం ప్రకారం జపాన్‌లోని టోకియో నగరంలో ఉన్న బిలియనీర్ల కంటే మన ముంబయ్‌లో ఎక్కువ మంది ఉన్నట్లు, ఆసియాలో నాలుగవ ధనిక నగరంగా పెరిగినట్లు వెల్లడైంది. ప్రపంచంలోని 2,325 మంది బిలియనీర్ల ఆస్థుల మొత్తం 7.3లక్షల కోట్ల డాలర్లు. గతేడాదితో పోల్చితే ఈ ఏడు ఏడుశాతం బిలియనీర్లు అభివృద్ధి చెందితే వారి ఆస్తులు 12శాతం పెరిగాయని వెల్త్–ఎక్స్ అనే సంస్థ పేర్కొన్నది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో చదివిన వారిలో 11 మంది ఉంటే ముంబయ్ విశ్వవిద్యాలయంలో చదివిన బిలియనీర్లు కూడా అంతమంది ఉన్నారట. ప్రపంచంలో పెన్సిల్వేనియా, హార్వర్డ్, యేలే విశ్వవిద్యాలయాల్లో చదివిన వారిలో వరుసగా 25,22,20 మంది చొప్పున బిలియనీర్లతో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. అలాంటి విశ్వవిద్యాలయాల జాబితాలో మన దేశంలో ఒక్క ముంబయ్ యూనివర్సిటీకి మాత్రమే చోటు దక్కింది. ఆసియాలో వరుసగా హాంకాంగ్‌లో 82, బీజింగ్‌లో 37, సింగపూర్‌లో 32, ముంబయ్‌లో 28 మందితో మొదటి నాలుగు స్థానాలు పొందాయి. మొదటి పది స్థానాలలో మరొక భారతీయ నగరమేదీ లేదు. ప్రపంచలో ముంబయ్ బిలియనీర్ల జాబితాలో పదకొండవ స్థానంలో ఉంది. మొదటి స్థానంలో న్యూయార్క్ 103, మాస్కో 85, హాంకాంగ్ 82, లండన్ 72తో అగ్రస్థానంలో ఉన్నాయి.

ప్రపంచ బిలియనీర్లలో ఆరవ స్థానంలో ఉన్న మన దేశంలో ప్రస్తుతం వంద మంది బిలియనీర్లు ఉన్నారు.వారి ఆస్థుల మొత్తం 175 బిలియన్ డాలర్లు. రెండవ స్థానంలో ఉన్న చైనాలో 190 మంది వద్ద 440 బిలియన్ డాలర్లు, అమెరికాలో అత్యధికంగా 571 మంది ఉన్నారు. వారి విలువ 2,266 బిలియన్లు. మూడవ స్థానంలోని బ్రిటన్‌లో 130 మంది వద్ద 395 బిలియన్లు ఉన్నాయి. ఈ సంస్థ అంచనా ప్రకారం 2020 నాటికి ప్రపంచ బిలియనీర్ల సంఖ్య 3,800గా ఉండవచ్చు. ఒక ఖండంగా ఐరోపాలో గరిష్టంగా 775 మంది ఉన్నారు. ఈఏడాది అమెరికాలో కొత్తగా 57 మంది తయారయ్యారు. ఆసియన్ బిలియనీర్లు ఈ ఏడాది 30శాతం సంపదలను పెంచుకున్నారు. ప్రపంచ సంపదలో 34శాతం 20 నగరాలలో ఉంది. బిలియనీర్ల సగటు వయస్సు 63 సంవత్సరాలు, కేవలం 16శాతం మంది మాత్రమే విద్యా సంస్థల్లో చదువుకున్నారు.

- సత్య

ఆవును గీసేద్దామా!



దారేది?



మేరీ ఇంటికి చేరుకోవాలంటే దారి తెలియడం లేదట..
మరి ఆ దారి ఏదో మీరు కనుక్కుంటారా?

కుక్క - నక్క

కథ

అడవిలో ఉండే నక్క ఒకటి ఒకనాడు దారితప్పి ఊళ్లోకి వచ్చేసింది. అది తోవ వెంబడి వెళుతుండగా ఒక కుక్క దానికి ఎదురు వచ్చింది.

నక్క ఆ కుక్కను ఆశ్చర్యంగా చూస్తూ 'నీ మెడలో ఆ గొలుసు, ఆ బిళ్ల ఏమిటి?' అని ప్రశ్నించింది.

'ఓహ్! అదా! నన్ను నా యజమాని పెంచుకుంటున్నాడు. వీధి కుక్కలతో పాటు నన్ను పట్టుకు వెళ్లి కాల్చివేయకుండా ఉండటానికి ఈ బిళ్లను నా మెడలో కట్టాడు' అని కుక్క చెప్పింది.

'ఆశ్చర్యంగా ఉందే' అంది నక్క. నీవు అడవిలో ఉంటావు కాబట్టి నీకు తెలియదులే. మా యజమాని చాలా మంచివాడు. నన్ను తన ఇంట్లో పెట్టుకుని పెంచుకుంటున్నాడు. నాకు మంచి మంచి రొట్టెలు, మాంసం, పాలు అన్నీ పెడతాడు. రోజూ వేడి నీళ్లతో స్నానం చేయిస్తాడు. నాకు తినడానికి పళ్లెం, పాలు తాగడానికి గిన్నె ఉన్నాయి. అంతేకాదు, పడుకోవడానికి మెత్తటి పరుపు కూడా ఉంది' అంది కుక్క గర్వంగా. 'అలాగా' అంది నక్క ఈర్ష్యగా. 'అంతేకాదు మా యజమాని దగ్గర బోలెడు పిల్లులు కూడా ఉన్నాయి. జాతివైరం మరచి మేమంతా సరదాగా ఆడుకుంటాం' అని చెప్పింది కుక్క.

'మిత్రమా! ఈ రోజు నుంచి మనమిద్దరం స్నేహితులం. నన్ను మీ ఇంటికి తీసుకుని వెళ్లు' అంది నక్క. సరేనని కుక్క నక్కను తన ఇంటికి తీసుకువెళ్లింది. యజమాని చూస్తే కొడతాడని నక్కను పెరట్లో చెట్టుచాటున దాచి తన రొట్టెలు, మాంసం దానికి పెట్టసాగింది కుక్క.

కుక్క తనకు చేసే అతిథి మర్యాదలకు సంతోషించాల్సిందిపోయి అడవిలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉంటే ఈ కుక్కకు ఇన్ని సౌకర్యాలు, ఇంత వైభోగమా అని అసూయ చెందింది నక్క.

'నీవొచ్చి చాలా రోజులైంది. నా యజమాని చూస్తే నిన్ను చంపేస్తాడు వెళ్లిపో' అంది కుక్క. 'మిత్రమా! నిన్ను వదిలివెళ్లాలని లేదు. ఇంకొక్క రోజు ఉండి వెళతాను' అంది నక్క. మరుసటిరోజు అందరూ నిద్రపోతున్న సమయంలో నక్క పిల్లి పిల్లలను చంపితిని, ఎముకలు పడేసి వెళ్లిపోయింది. నమ్మకంగా ఉంటూ కుక్క ఇంత పని చేసిందనుకున్న యజమాని కుక్కను చితక్కొట్టి ఇంటి నుంచి తరిమేశాడు.

నీతి : దుర్మార్గులతో స్నేహం ప్రమాదకరం.

పిల్లుల లెక్క

పిల్లలూ ఈ బొమ్మలో ఎన్ని పిల్లులున్నాయో లెక్కపెట్టండి చూద్దాం!

ఒకేలాంటి ఏనుగులు



ఇక్కడున్న ఏనుగుల్లో ఒకేలా ఉండే కవల ఏనుగులున్నాయి.
వాటిని మీరు కనుక్కోగలరా!

తేడాలేవి?



పై బొమ్మలు రెండూ ఒకేలా ఉన్నా వాటిల్లో పది తేడాలున్నాయి.
అవేంటో కనిపెట్టి సున్నా చుట్టేసేయండి.

పద బంధం



ఈ బొమ్మల పేర్లలోని ఇంగ్లీష్ మొదటి అక్షరాన్ని పక్కన ఉన్న గడిలో రాయండి.
అలాగే గళ్లలోని మొత్తం అక్షరాల్ని కలిపితే ఒక పదం వస్తుంది.
ప్రయత్నించి మా జవాబుతో సరిచూసుకోండి.

జవాబు: Torch + Anchor + Banana + Lizard + Eel = TABLE.

అక్కడ ప్రేమిస్తే ప్రాణాలు తీసేవారుండరు. ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసేవారూ వుండరు. గృహ హింస కేసులూ కానరావు. మానభంగాల ఘటనలు కూడా కనిపించవు. కేవలం ప్రేమ గూళ్లూ, అందులో సంతోషంగా సహజీవనం చేసే జంటలు మాత్రమే కనిపిస్తాయి. ఇది వారి సంప్రదాయం.

ప్రేమ గూళ్లు

పదమూడేళ్లు వస్తే చాలు! ఆడపిల్లకు ఎప్పుడెప్పుడు మరో ఇంటికి పంపిద్దామా అని చూస్తారు కంబోడియాలోని రతనకిరి ప్రావిన్స్‌లోని 'క్రెయంగ్ తెగ' వాసులు. కానీ, వాళ్లు పంపించాలనుకునేది పెళ్లి చేసి, అత్తారింటికి కాదు. కూతురు–తనకిష్టమైన భాగస్వామిని వెతుక్కునేందుకు. ఒకసారి చూసి నాలుగు సార్లు మాట్లాడి అయిదో సారి అబ్బాయి మంచోడని పెళ్లి చేసుకోవడం, తీరా కలసి బతకడం మొదలెట్టాక వచ్చే సమస్యలకు జీవితాన్ని బలి చేయడం లాంటి వాటికి క్రెయంగ్ తెగ చాలా దూరం. యువతీ యువకులు ఒకరిని ఒకరు పూర్తిగా అర్థం చేసుకోవాలి. ఆ తర్వాతే వైవాహిక జీవితంలోకి అడుగెట్టాలి. అన్నదే ఆ తెగ ప్రజలు నమ్మే సిద్ధాంతం. అందులో భాగంగానే ఆడపిల్లలకు పూర్తి స్వేచ్ఛనిస్తారు తల్లిదండ్రులు. వయసొచ్చిన పిల్లలకు తమ ఇంటి వెనుక భాగంలో మంచె నిర్మించి దాని మీద ఆకులూ గడ్డితో అందమైన పూరింటిని కడతారు. పక్షుల గూడులా చూడముచ్చటగా వుండే ఈ ఇళ్లకు వారు పెట్టుకున్న పేరు 'ప్రేమ గూళ్లు' (లవ్ హట్స్). కొత్తగా నిర్మించిన ఆ ఇంటిలోకి కూతురిని పంపుతూ '... నీ మనసును బాగా అర్థం చేసుకునే వ్యక్తి దొరికినప్పుడు మాత్రమే పెళ్లి చేసుకో' అని చెప్తారు. ఈ ప్రేమ గూళ్ల వెనక వున్న ఉద్దేశం కూడా అదే. మామూలుగా అయితే, ప్రేమించిన వ్యక్తిని ఇంటికి తీసుకు రావాలంటే అటు అమ్మాయిలకూ ఇటు తల్లిదండ్రులకూ ఇబ్బందిగానే వుంటుంది. అదే వారి కోసం ప్రత్యేకంగా ఓ ఇల్లు వుంటే తనకు నచ్చిన వ్యక్తిని ఏకాంతంగా కలుసుకోవడానికి మనసు విప్పి మాట్లాడుకోవడానికి వీలుగా వుంటుందన్నది వారి అభిప్రాయం.

ఆమె ఇష్టం

ఇక, ఆ అబ్బాయితో స్నేహం చేయడమా, సహజీవనమా అన్న విషయం అమ్మాయి ఇష్టంమీదే ఆధారపడి వుంటుంది. ఆమె అభిప్రాయానికి వ్యతిరేకంగా అబ్బాయిలు ప్రవర్తించడానికి లేదు. సహజీవనం చేస్తున్న ఆ అబ్బాయిని 'ఇక నా ఇంటికి రావొద్దు' అని అమ్మాయి చెప్పిందంటే ఆమె నిర్ణయాన్ని కాదనడానికి లేదు. సరైన జోడీ దొరికి పెళ్లి చేసుకునేవారకూ అమ్మాయిలు ఈ ప్రేమ గూళ్లలోనే వుంటారు. పెళ్లయ్యాక భార్యాభర్తలిద్దరూ తమ పాత స్నేహాలను, బంధాలను వదిలేసి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారు. అప్పట్నుంచి వారిద్దరూ ఒకరికి ఒకరు. క్రెయంగ్ తెగ ప్రజలు కొన్ని శతాబ్దాల నుంచి పాటిస్తున్న పద్ధతి ఇది. ఈ ప్రేమగూళ్ల గురించి స్థానికులను ఎవరినైనా కదిలిస్తే ...'ఆకర్షణనే ప్రేమ అనుకుని పెళ్లి చేసుకున్నాక విడిపోయేకన్నా మనకు నచ్చిన వ్యక్తితో కొంతకాలం కలిసి వుంటే అతను ఆమెలో మంచి చెడులు తెలుస్తాయి' అంటూ తమ వైవాహిక జీవితాన్నే ఉదాహరణగా చెప్తారు రతనకిరికి చెందిన కంపన్, బ్రాంగ్ దంపతులు. 'నేను పెళ్లికి ముందు వేరొకరితో సహ జీవనం చేసినా ... బ్రాంగ్‌ను కలిశాక ఇతనే సరైన వాడని నిర్ణయించుకుని పెళ్లాడాను. ఇప్పటికి నలభై ఏళ్లగా సంతోషంగా జీవిస్తున్నాం' అంటుంది కంపన్. వీరి కూతురు గాహమ్ కూడా లవ్‌హట్‌లో వుంటూ మూడేళ్ల కిందట ప్రియా అనే అబ్బాయిని ఇష్టపడింది. ఏడాది పాటు కలిసున్నాక ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఇప్పుడు వీరికో పాప. సహ జీవనం చేసే రోజుల్లో గర్భం దాల్చకుండా పూర్వం ఓ రకపు చెట్టు నుంచి తీసిన మందు వాడేవారు. ఇప్పుడు ఆధునిక గర్భనిరోధక సాధనాలను వాడుతున్నారు. నిజానికి పెళ్లికి ముందు గర్భం దాల్చడం ఇక్కడ సర్వసాధారణం. వారిద్దరూ పెళ్లి చేసుకుంటే సరి. మరో అతన్ని వివాహమాడితే అతనే ఆ బిడ్డకు తండ్రిలా వ్యవహరిస్తాడు.

బయటి ప్రపంచానికి ఈ పద్ధతి విచిత్రంగా అనిపించినా... దీనివల్ల తమకు మంచే జరుగుతుందంటారు స్థానికులు. క్రెయంగ్ తెగలో విడాకులు తీసుకోవాలనుకునే దంపతులు చాలా అరుదు. అంతేకాదు! ఇక్కడ మానభంగాలు, పరువు హత్యలూ, అనుమానంతో భార్యను హింసించడం, దంపతుల మధ్య గొడవలతో ఆత్మహత్యలూ, హత్యల్లాంటి నేరాలు జరిగిన ఘటనలూ కనిపించవు. ఇదో సంప్రదాయం!

పొడవాటి కుటుంబం

ఎప్పుడైనా...ఎక్కడైనా ... ఎవరైనా పొడవుగా కనిపిస్తేనే ఆశ్చర్యం వేస్తుంది. అబ్బా..అనుకుంటాం. అలాంటిది ఒక ఫ్యామిలీ మొత్తం పొ...డ...వు...గా కనిపిస్తే... అలా రోడ్డు మీద నడిచొస్తుంటే చూడ్డానికి ఎలా వుంటుంది? కళ్లు మాత్రమే పని చేస్తాయేమో! అలా చూస్తుండిపోతామంతే. పూనే వాసుల పరిస్థితి అదే. కులకర్ణి కుటుంబీకులను చూసి ఆశ్చర్యచకితులు కాని వారు వుండరంటే నమ్మండి. శరద్ (218 సెం.మీ) , సంజోతు కులకర్ణి (190 సెం మీ) వివాహం చేసుకున్నప్పడు ప్రపంచంలోకెల్లా పొడవాటి దంపతులుగా గుర్తింపు పొందారు. మృగ (185 సెంమీ), సన్య (193 సెంమీ) అనే కుమార్తెలు కలిగాక ... పొడవాటి కుటుంబంగా పిలవసాగారు జనం. గిన్నిస్ బుక్‌లోకి ఎక్కడమే మిగిలింది.

ఇంత పొడవుంటే సమస్యలేం లేవా? అంటే ఎందుకు లేవు. ముందుగా తమ ఇంటి తలుపులను మార్చారు. తమ పొడవుకు అనుకూలంగా భారీ తలుపులను ఏర్పాటు చేసుకున్నారు. ఇవనేముందిలెండి? కుర్చీలు, సోఫాలు, మంచాలు, వంటగది, పడక గది...అన్నీ మార్చుకున్నారు ఇక వీరు బస్సుల్లో ప్రయాణించడం పెద్ద సమస్య. నిలబడితే పైన టాప్ తగులుతుంది. అందుకే సొంత వాహనాలనే ఎక్కువగా వాడుతుంటారు. వీరికి బూట్లు, చెప్పులు ఒక పట్టాన దొరకవు. తమ సైజు పాదరక్షలను ఆన్‌లైన్లో తెప్పించుకుంటుంటారు. ఏదోలెండి! ఎవరికి తగ్గ సమస్యలు వారివి. మరి ఇంత భారీకాయులకు సమస్యలు కూడా భారీగానే వుంటాయి.

వింత సృజన

ఇలాంటి జంతువులను, పక్షులను ఎప్పుడూ ఎక్కడా చూడలేదే?! ఎక్కడి నుంచి తీసుకొచ్చారు వీటిని? అనిపించకమానదు. నిజానికి ఇవన్నీ కంప్యూటర్‌లో తయారు చేసిన జంతువులు, పక్షులే ఇవన్నీ అంటే మరింత ఆశ్చర్యపోతారు. రకరకాల జీవుల శరీర భాగాలను కలగలిపి తయారుచేశారిలా. ఆ ఘన త కాలిఫోర్నియాకు చెందిన సారా డిరెమర్ అనే ఆర్టిస్టుకి చెందుతుంది. ఆమెకు ఇలాంటి చిత్ర విచిత్రమైన ప్రాణులను తయారుచేయడమంటే మహా సరదా. అందుకోసం విసుగూ విరామం లేకుండా కంప్యూటర్ ముందు కూర్చుని గంటల తరబడి పని చేస్తుంది. ఈ బొమ్మలను జాగ్రత్తగా గమనిస్తే ... వాటి తయారీ కోసం సారా ఎంత కష్టపడిందో తెలుస్తుంది. ఏదైనా ఒక ప్రధానమైన జంతువు యొక్క ఆకారం చెడకుండా... మరో ప్రాణి శరీర భాగాన్ని అతికించడమంటే చిన్న విషయం కాదు. ఒక వైద్యుడికి, చిత్రకారుడికి కావాల్సినంత ప్రతిభ, ఓర్పు అవసరం. అవన్నీ వున్నాయి కనకనే సారా వీక్షకులను ఇలా ఆకట్టుకుంటోంది.

✡